వ్యవస్థాపకులు

**కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు

**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు

**మునుగంటి వెంకట్రావు**

64వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 64 | మార్చి - మే 2026 | సంచిక - 10-12














64వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 64 | మార్చి - మే 2026 | సంచిక - 10-12

## ఈ సంచికలో....

పేజీలలో

1. అమర గాయకుడు ఉస్తాద్ బడేగులామ్ అలీఖాం - స్వర్గీయ ఆవంత్స సోమసుందర్.......................3
2. విదుషి శ్రీమతి కాకటూరి పద్మావతి సంగీత రచనల పరిమళాలు - శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు .....................12
3. కృషి ఉంటే మనిషే ఋషి అవుతాడు.. - శ్రీ మోదుమూడి సుధాకర్................................22
4. కృతి "సాధించెనే" గురించి ఒక చిన్న వివరణ - శ్రీ తాడేపల్లి లోకనాథ శర్మ..............................24
5. సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'............................................................25

## ముఖచిత్రం

1) శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ, హైదరాబాద్ వారి శ్రీభద్రాచల రామదాసు కీర్తనల ఆన్ లైన్ సర్టిఫికెట్ బోధన ప్రాజెక్ట్ ను ప్రారంభిస్తున్న తెలంగాణ గవర్నర్ గౌ.శ్రీ శివప్రతాప్ శుక్లా.

2) క్లాసికల్ ఆర్ట్స్ సొసైటీ - హ్యూస్టన్‌లో విద్వాన్ శ్రీ మల్లాది సూరిబాబుగారి సన్మాన కార్యక్రమం (21.03.2026) - MTS ఛైర్మన్ శ్రీ కుమార్ భాష్యం మరియు CAS ఛైర్‌పర్సన్ శ్రీమతి ప్రభా బాల చిత్రంలో కలరు.

3) సంగీత సామ్రాట్ శ్రీ ఎమ్.ఎస్. బాలసుబ్రహ్మణ్య శర్మ కళాసంస్థ సుమధుర గాన సుధాకర శ్రీ కె.వి. బ్రహ్మానందం కళాసంస్థ తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో ప్రపంచ గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత, టి.టి.డి. ఆస్థాన విద్వాన్ మృదంగం విద్వాన్ పద్మశ్రీ డా॥ యల్లా వెంకటేశ్వరరావు గారికి స్వర్ణకంకణ సన్మానమహోత్సవం విజయవాడలో.

4) డా॥ RNS శైలేశ్వరి గారికి "ఓగిరాల వీరరాఘవశర్మ ఎండోమెంట్ పురస్కారం" అందించిన విశాఖ మ్యూజిక్ ఎకాడమీ. వార్త లోపలి పేజలలో.

5) కాకినాడలోని ప్రముఖ సంగీత సభ సరస్వతీగానసభ నుండి 'జీవన సాఫల్య పురస్కారం' అందుకుంటున్న విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి.

6) 99 టివి ఉగాది పురస్కారాన్ని ప్రముఖ సినీనటులు గౌ॥ శ్రీ చిరంజీవి చేతుల మీదుగా స్వీకరిస్తున్న విద్వాన్ 'సంగీతాచార్య' శ్రీ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు - వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.

గతానికి స్వాగతం

# అమర గాయకుడు
# ఉస్తాద్ బడేగులామ్ ఆలీఖాం





స్వర్గీయ ఆవంత్స సోమసుందర్

టుమ్రీ, ఖయాల్ వంటి సంగీత ప్రక్రియలను అపూర్వ సంవిధానంతో శోభస్కరించి విశిష్టతను సాధించిన మహా గాయకుడు ఉస్తాద్ బడేగులామ్ ఆలీఖాం....

ఆయన తన ఏడవ ఏట కచేరీలు చేయ నారంభించి యావద్భారతంలోనూ అనన్యకీర్తితో ప్రకాశించిన ధ్రువతార! పసితనంలోనే శ్రోతలను ఆశ్చర్యచకితులుగా చేసిన ప్రౌఢతర సంగీతాన్ని సృష్టించాడు. అపూర్వకాంతితో చిరస్మరణీయుడయ్యాడు.

అనూనమైన భారతీయ సంగీత రస సంప్రదాయం ఆయన జీవన నాడులలో స్థిరనివాస మేర్పరచుకొన్నది. అదే ఆయనకు ఆజన్మతః సిద్ధించిన మహా ప్రతిభకు కారణమైంది.

సుమారు నూటయేభయి సంవత్సరాలుగా బడేగులామ్ కుటుంబం ప్రసిద్ధ సంగీత వేత్తలకు కాణాచి. ఆయన వంశ పురుషులంతా సంగీత నిష్ణాతులే !

**సంగీత రసవాహిని :**

వీరి కులస్వాములలో అధిక సంఖ్యాకులు చిరకాలంగా దర్బారు గాయకులు; మహరాజుల ఆస్థాన విద్వాంసులు. వీరి ముత్తాత బాబా కాశి దాస్ జీ ఇస్లాం మతాన్ని వరించారు. ఆయన, మహరాజా రంజిత్ సింహ దర్బారులో ఆస్థాన విద్వాంసుడు.

ఆయనే కాదు. వీరి వంశ పురుషులలో అనేకులు సంగీతాకాశంలో ఉజ్వల తారలుగా ప్రకాశించిన వారున్నారు. ఈద్ ఖాన్, ఆర్షదల్లీ, మహ్మద్ ఖాం, దారాఫజల్. ఫీర్ దాదా. ఖాలిమ్ మహ్మద్, భాయీ మహ్మదల్లీ ఖాం, ప్రభృతులు ప్రఖ్యాతులు.

అట్టి ఉత్కృష్ట సంగీత వంశంలో బడేగులామ్ 1901 లో జన్మించాడు. ఈయన తండ్రి ఉస్తాద్ ఆలీ బక్షికసూర్ వాలా, గొప్ప సంగీతవేత్త. తాత ముత్తాతలనుంచి అనుస్యూతంగా పరిఢవిల్లుతూన్న సంగీత సంప్రదాయాన్ని అందుకొని పరిపోషించి

నూత్న తరంగాల చేకూర్చిన వాడాయన !

తాన్ రసఖాఁఘరానాకు చెందిన ఖాన్ సాహెబ్ ఫతే అలీఖాఁ అనే గాయకుడు ఆనాటి సంగీత లోకంలో గొప్ప ప్రఖ్యాతుడు. ఆయనవద్ద ఆలీభక్ష్. వారి సోదరుడు కాళేఖాన్ గార్లు సుశ్రూషచేసి, క్షుణ్ణంగా సంగీత విద్యను అభ్యసించారు. అయితే ఆలీభక్షుకన్న ఆయన తమ్ముడు కాళేఖానుగారికే గాయకుడుగా ప్రఖ్యాతి లభించింది. జమ్మూ మహరాజా దర్బారు గాయకుడుగా కాళేఖాన్ కుదురుకొని, ఆమరణాంతం ఉజ్వలకీర్తి ననుభవించారు. "పంజాబీ గాయ్ కా" అనబడే పాటియాలా ఘరానాను కాళేఖాన్ సముద్ధరించారు. అదే ఘరానా (సంప్రదాయం) ను బడేగులామ్ పరిపోషించారు.

**శైశవ ప్రతిభాశాలి :**

బడేగులామ్ ఆరుమాసాల పసికూనగా ఉన్న రోజులవి. పిన తండ్రి కాళేఖాఁ పసివాడ్ని ఒడిలో పడుకోబెట్టుకొని ఒకనాడు గొంతెత్తి పాడుకుంటున్నాడు. అకస్మాతుగా పసివాడు గొంతు సారించి అదేశ్రుతిలో ఏడ్పు ప్రారంభించాడు. ఈ నిర్దష్ట శ్రుతి లీననాదానికి పిన తండ్రి సంభ్రమించాడు. "ఈ చిరంజీవి గొప్ప గాయకుడై తమ వంశానికి యితోధిక కీర్తి ప్రతిష్ఠలు చేకూరుస్తాడ"ని ఆనాడే ఆయన విశ్వసించాడు. ఆ ఆనందంతో ఈ సంఘటన గురించి అందరికీ చెప్పేవారాయన !

ఆలీబక్ష్ పాటియాలా మహరాజా దర్బారు గాయకులు. వీరికా మహరాజు "జనరల్" అనే బిరుదునిచ్చి సత్కరించాడు.

బడేగులామ్ ఏడేళ్ళ వాడయ్యాడు. తండ్రి ఆలీబక్ష్ సముచితోత్సాహంతో "గండాబంధన్" అనే విద్యా ప్రారంభోత్సవాన్ని జరిపారు. ఈ ఉత్సవానికి ఆనాటి మహా విద్వాంసులెందరో విచ్చేశారు. చిరంజీవిని ఆశీర్వదించారు. వారిలో ఉస్తాద్ మియాఁజాన్, నాజర్ ఖాఁ, ఖాదింహుసేన్, చజ్జూఖాఁ ప్రభృతులు ప్రముఖులు. ఇలాంటి మహా గాయకుల ఆశీస్సులు పొందగలిగిన అదృష్టశాలిగా – బడేగులామ్ సంగీత జీవితం ప్రారంభమైంది.

ఈ గండాబంధన్ సందర్భంలోనే నిండు సభలో ఆలీభక్ష్, తముడు కాళేఖాఁను చిరంజీవికి విద్యాగురువు కావాలని ఆజ్ఞాపించారు. అన్నగారి ఆజ్ఞను శిరసావహించి కాలేఁఖాన్ చిరంజీవికి విద్యా గురువుగా గురుపీఠం అలంకరించాడు. తదాదిగా విద్య పరంపరాభివృద్ధి కాంచ నారంభించింది.

సంగీత విద్యార్ధిగా ప్రాధమిక పాఠాలు సాగుతున్న రోజుల్లోనే ఒక కచేరీలో పాడే అవకాశం ఈ బాల గాయకునికి కలిగింది.... ఆయన పన్నెండేళ్ళ వాడయ్యాడు; ప్రిన్స్ ఆఫ్ వేల్సు భారతదేశంలో పర్యటన జరుపుతున్న రోజులవి.. పాటియాలా దర్బార్ కు ఆయన ఆహ్వానించబడ్డాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్సు సమక్షంలో వారి గౌరవార్ధం జరిగిన సంగీత సభలో బడేగులాం గానం చేశాడు. ఈ గానకచేరి సంపన్నులైన సంగీత రసికుల కెందరికో బడేగులాంను పరిచయం చేసింది. ఇదే ఆయన కీర్తి పథానికి ప్రాథమిక విజయ ద్వారాన్ని తెరిచింది.

పదిహేడేళ్ళ వయసులోనే హరిదాసస్వామి వర్ధంతి సభలో పాల్గొనేందుకు బడేగులాంకు బొంబాయి నుంచి ఆహ్వానం వచ్చింది. ఆనాటి సంగీత సామ్రాట్ లైన అల్లాదియాఖాఁ, ఫయాజ్ ఖాఁ, ముష్టాక్ హుసేనాఁ, శ్రీమతి కేసరీబాయ్, వంటి

ఉద్దండుల సమక్షంలో గానం చేసే సదవకాశం ఆయనకు లభించింది.

## గురువు మరణం

ఎంతో శ్రద్ధాసక్తులతో, ప్రేమాభిమానాలతో పదేళ్ళపాటు సంగీత శిక్షణ నిచ్చిన పినతండ్రి కాళేఖాన్ – దురదృష్టవశాత్తూ కాలధర్మం చెందారు, తరువాతకాలాన తండ్రిగారే బడేగులాంకు విద్యా గురువయ్యారు. అదిచాలక, అఫ్షీన్ ఆలీవద్ద కొంతకాలమూ, బాబా షిండేఖాఁవద్ద కొంతకాలమూ విద్యాభ్యాసంచేశాడు బడేగులాం.

ధ్రుపద్. ధమాల్, ఖ్యాల్ వంటి అపురూప సంవిధానాలను తండ్రివద్దనే నేర్చుకొని, విశేషసాధనంతో స్వాయత్తం చేసుకొన్నాడు.

కాలేఖాఁ మరణంతో "పాటియాలా ఘరానా" అంతరించి పోయిందనే అపప్రధ వ్యాపించ నారంభించింది. దాన్ని ఎలాగైనా తొలగించి, పాటియాలాకీర్తి పతాకను తిరిగి నిలబెట్టాలన్న పట్టుదల బడేగులాంకు కలిగింది. కఠోరసాధనం చేయనారంభించాడు. తన 22వ యేటనే మహాయకుడుగా రూపొందడమేగాక, పాటియాలా ఘరానాకు కొత్త వెలుగులు చేకూర్చాడు.

బడేగులాం తన రాక్షస సాధనంద్వారా పండ్రెండు శ్రుతులను స్వాధీనం చేసుకొన్నాడు. స్వరజ్ఞానంలో అనన్య సామాన్యమైన సిద్ధి పొందాడు. అందువల్లనే అతనికి ''స్వరబ్రహ్మ'' అనే బిరుదు లభించింది. ఇంతటి స్వరజ్ఞానం మరేయితర గవయ్యాలకూ లేదనడం అతిశయోక్తి కాదు.

ఆయనబడిచదువు అక్షరమాల నేర్చు కోవడంతోనే పరిసమాప్తి పొందింది. అయినా సాహిత్యానుభూతిలో సహజ ప్రవృత్తి ఆయనకు సిద్ధించింది. కనుకనే ఆయన గానం సాహిత్యానుభూతిని రాగభావాలలో విలీనంచేసిన పారమ్యతను సాధిస్తుంది. ఏకాగ్రచిత్తంతో వినగలిగే శ్రోతల మనోనయనాలకు ఏవో అమేయ సుందరదృశ్యాలు సాక్షాత్కరిస్తాయి, చర్మచక్షువు లానంద పారవశ్యంతో అశ్రువులకాంకితా లవుతాయి.

**సంగీతం కేవలం శాస్త్రజ్ఞానం గల పండితులకే కాదనీ, సర్వ జనామోదకరంగా కర్ణపేయం కావాలనీ మొదటిసారిగా చాటి చూపిన విద్వాంసుడీయనే!**

## సంప్రదాయంలో ప్రయోగం :

పాటియాలా ఘరానాకు చెందినవాడే అయినా – బడేగులాం తనకు తానుగా ఒక బాణీని సృష్టించుకొన్నాడు. వేసిన సంగతులే మళ్లీ మళ్ళీ వేస్తూ, చూపిన మెళకువలే చూపుతూ గంటలతరబడిగా రాగాలాపనలో జిడ్డుపట్టిస్తూ శ్రోతల ఓపికనీ ఓరిమిని పరీక్షిస్తూ గడిపే పాత పద్ధతికి స్వస్తి పలికాడీయన. సాధారణ సంగీత రసికజనులకు చిరపరిచితాలయిన ప్రఖ్యాత రాగాలనే పాడి అనన్యసాధ్యమైన రక్తికట్టించ గలిగేవారాయన.

పూర్వీ, కేదార్, ముల్తానీ, మాల్ కౌస్, భైరవ్, భీమ్ పలాస్, వంటి రాగాలను ఎన్నికచేసి శ్రుతి మాధుర్యంతో ఎత్తుబడిలోనే రససిద్ధిసాధించగలిగేవారాయన! ఏ రాగాన్నైనా అరగంటసేపు ఆలపించి ఆరాగ భావాన్ని అతి విశిష్టంగా ప్రదర్శించగలిగేవారు, ఖ్యాల్ గానం చేసి దానిలోనే గమకాలు, నెరవులు. చిట్టస్వరాలు చక్కగా ప్రదర్శించి, ఒకటో రెండో ట్రుమీలతో కచేరీ

ముగించడం ఈయనకలవాటు. స్వీయరచనలైన టుమ్రీలను భావయుక్తంగా గానంచేసి, ముగ్ధమోహనంగా సభారంజకత్వం కలిగించడంలో ఈయనకీయనే సాటి! టుమ్రీలలో సాధారణంగా విప్రలంభశృంగారమో. ప్రేమవైఫల్యమో, ఇతి వృత్తాలుగా స్వీకృతాలవుతుంటాయి. కనుకనే వీరి టుమ్రిలు రసప్లావితాలయి కారుణ్య భావనతో తొణికిసలాడుతూ, శ్రోతలకు హృదయ ద్రావకమవుతాయి. కనుకనే ఈయనకు "రసచక్రవర్తి" అనీ, "టుమ్రీ–కీ–పాద్ షా" అని బిరుదులు సహజంగా లభించాయి.

నిజానికి టుమ్రీ గానంచేసి శహబాష్ అనిపించుకోగలగడమంటే సామాన్యవిషయంకాదు. శారీరంపై అతివేలమైన ప్రభుత ఉండి తీరాలి. స్వరజ్ఞానం అపారంగా స్వాధీనం కావాలి; గానంలో మెళుకువలెరిగి భావోత్ప్రేక్ష లెక్కడచేయాలో, తీవ్రముద్ర లెక్కడ కలిగించాలో, అలవోకగా సునిశిత సౌకుమార్యాల నెక్కడ బింబించాలో కేవలం కళాహృదయంతో అవగాహన చేసుకోవాలి. తద్వారా ఒక గాన ప్రణాళికను సంసిద్ధం చేసుకోవాలి. ఇన్ని శక్తులూ సమకూడినందువల్లనే అనన్య సామాన్య ప్రతిభా సంపదతో బడేగులాం టుమ్రీగానం నూరు రేకులతో విరాజిల్లింది. అందువల్లనే స్వీయ రచనలగు టుమ్రీలను గానం చేయడంలో విశిష్ట సౌలభ్యాన్ని (ease) సంతరించు కొన్నాడాయన!

వీరి టుమ్రీలకు "సబరంగ్" అనే ముద్ర అనుసంధించబడింది. అసంఖ్యాకంగా టుమ్రీలు రచించారీయన. టుమ్రీ అనే సంగీత ప్రక్రియకు పూర్వమెన్నడూ లేని సభాగౌరవాన్నీ పరిగణనూ కలిగించిన ప్రాతఃస్మరణీయుడీయనే! బడేగులాం రచనలైన టుమ్రీ లనే యిప్పటి గాయకులెందరో గానం చేస్తున్నారు. ఈయన గానం చేయగా ఎన్నో టుమ్రీలు గ్రామఫోను రికార్డులుగా శబ్దముద్రలను పొంది, బడేగులాం అమరగానాన్ని తరంనుంచి తరానికి అందిస్తున్నాయి!

## గంధర్వ గానం

బడేగులామ్ కు మధురతర గంభీర కంఠస్వరం వరప్రసాద లబ్ధమైనది. ఆ గాత్ర ధర్మాన్ని సాధనా పటిమతో పటిష్ఠమొనర్చారాయన. స్వీయ ప్రతిభా సమన్విత మొనర్చుకొన్నారాయన. కొండ కొమ్ములనుంచి జలధారలు దుముకుతూ కల్పించే విచిత్రనాదాల నాకంఠం ప్రసరించగలిగేది. నిర్జనారణ్యాల ఏకాంత గహ్వరాల నుంచి వెలువడే ఆర్త నాదాలను ప్రతిధ్వనించి శ్రోతను చప్పున బెంగటిల్లేటటు చేయగలిగేది. ప్రియా వియోగ దుఃఖాకుల విషాదరావాలను ఒక్కుమ్మడిగా ప్రతిధ్వనించి శ్రోతలలో ఎవరికి వారి స్వీయ విరహ బాధలను మేల్కొల్పి కన్నీళ్లు తెప్పించగలదాయన గాత్రధర్మం. ఇన్ని మనోధర్మాల నలవోకగా సాధించగలగడంవల్లనే శ్రోతలు అవ్యక్త పారవశ్యంలో మునిగితేలేవారు.

బడేగులాం గానంలో స్వరపరిశుద్ధత అపారం. స్వరప్రాముఖ్యత గానానికి ప్రాణ భూతమని ఈయన విశ్వాసం. ఆ ప్రమాణాలే... ఈయన గానాన్ని పండిత పామరులలో అతి లోక మైన ఆకర్షణను కలిగించేవి. ఈ కారణంవల్లనే ఆయనకి "స్వరభూషణ" అనీ "గాన విద్యాప్రపూర్ణ" అనే బిరుదులు భూషణాలయాయి.

విషయాంతరమేకాని, ఈ వ్యాసకర్త స్వీయాను

భూతిని వెల్లడించడం బొత్తిగా అనవసరంకాదు. సాధ్యమైనంత చేరువగా కూర్చుని వినగలిగే అదృష్టం ఈ వ్యాస రచయితకు రెండు పర్యాయాలు మాత్రమే లభించింది. అపార రసికతే తప్ప శాస్త్ర విషయ కించిజ్ఞుడైన భవదీయుడు రెండు పర్యాయాలూ అవ్యక్తానందానుభూతితో అశ్రుస్నాతుడయ్యాడు. గాత్ర ధర్మంతో యింత అనుభూతి పారమ్యతను పెల్లగించే శక్తి బడేగులాం తర్వాత ఒక్క బాలమురళీగానంలో మాత్రమే అనుభవించాడన్న సత్యం చెబితే చాలామంది ఈ వ్యాస కర్తను క్షమింతురు గాక! ఈ యిరువురిగానంలోనూ అస్మదాదులైన పామరులను సైతం సురధునీ తరంగసేచనకై సముద్ధరించే రసయోగ సిద్ధి అనితర సాధ్యమని ఈ వ్యాసకర్త సంభావిస్తాడు.

**బడేగులాం కుటుంబం :**

ఆయనకు ముగ్గురు సోదరులుండేవారు. ముఖార కల్లీ, అమానల్లీ, బరకతల్లీ అనేవారు. వీరిలో బరకతల్లీ ప్రఖ్యాతుడై – గజల్ టుమ్రీలను అద్భుతంగా గానం చేసేవాడు. కాని పాపం స్థూలకాయంతో అందవికారంగా ఉండడంవల్ల సభారంజన కలిగించలేకపోయేవాడు. అయినా బ్రతికి ఉన్నంతకాలం ప్రఖ్యాతిని అనుభవించినవాడే! కాని అన్నదమ్ములందరినీ బడేగులాం అధఃకరించి మహాగాయకుడై స్థిరపడ్డంవల్ల వారికీర్తి కొడిగట్టింది. సమకాలిక గాత్రజ్ఞులందరిలోనూ బడేగులాం అగ్రస్థానం ఆర్జించుకొన్నాడు.

యావద్భారతంలోను ఆయన కీర్తి విశేషంగా విస్తరిల్లింది. హిందూస్తానీ శాస్త్రీయ సంగీతానికే ఆయన వ్యక్తిత్వం మారుపేరుగా మారుమోగింది. హిందూస్తానీ సంగీతం ఈనాడనుభవిస్తున్న సమాదరణకు ఆయన కలిగించిన దోహదం యింతా అంతాకాదు. ఆయన సంగీతంతో మారుమ్రోగని చిన్న పెద్దనగరాలే భారతదేశంలో లేవనడం సాధారణోక్తి, కలకత్తా, బొంబాయి, మదరాసు, కరాచీ మున్నగు నగరాలలో ఆయనకు అఖండ సన్మానాలు జరిగాయి, సందర్భానుసారంగా పేర్కొన్న బిరుదులు. ఆయన గాయక జీవితాన్ని అలంకరించాయి,

శాస్త్రీయ సంగీతంలో కసరత్తులూ సాముగరిడీలూ ఎక్కువనీ, పాండిత్య ప్రకర్షకేగాని పామర జనరంజకత్వానికి పనికిరావడంలేదనీ, కనక యిది శాస్త్రమే కాని కళాభిరతి యిందులో మృగ్యమని సినీమా దర్శకులు తృణీకరిస్తూ వచ్చారు. ఈ తూష్ణీభావాన్ని బడేగులాం తొలగించదలచాడు. ఈయన మంద్రస్థాయిలో మేఘమల్హార్ రాగాలాపన ప్రారంభించి కంఠనాదంలోనే మేఘగర్జనలు ప్రదర్శించగలిగాడు. ధ్రుతకాలంలో తానాలను ప్రారంభించి ఉరుముల అలజడిని సృష్టించి సినీ దర్శకుల నాశ్చర్యమగ్నుల చేశాడు. తద్వారానే కొన్ని గొప్ప చిత్రాలలో గానంచేసే అవకాశం ఆయనకు లభించింది. ముఖ్యంగా పేర్కొనదగిన చిత్రాలు బైజుబావరా. మొఘల్.ఎ.ఆజామ్: వంటివి ప్రఖ్యాతాలు! ఈ రెండు చిత్రాలలోనూ ఈయన గానం తాన్ సేన్ కు ప్రయుక్తమైంది.

**భారతీయ సంగీతానికి ఫలప్రాప్తి :**

వైదికమతం సంగీతాన్ని మోక్షప్రాప్తికి సాధనా మార్గంగా స్వీకరించింది. కాని ఇస్లాంమతం సంగీతాది లలిత కళలను మత తత్త్వానికి విరుద్ధాలుగా నిషేధించింది. దీనికి భిన్నంగానే

సూఫీమతం ఇస్లాంలో సంస్కరణ వీచికల ప్రసరించి హృదయ స్థానాన్ని కల్పించింది. సంగీతాన్ని ఉత్కృష్ట పరమార్గంగా స్వీకరించింది.

భారత దేశంలో అక్బర్ చక్రవర్తి పరిపాలనా కాలం సంగీత సాహిత్యాలకు స్వర్ణయుగంగా భావించవచ్చు. అందునా భారతీయ సంగీతం – మూడు పూవులూ ఆరుకాయలూ ఆరుగాలం కాసింది. తాన్ సేన్ కాని, ఆంధ్రగాయకుడైన గోపాలనాయక్ గాని అక్బర్ దర్బారులో భారతీయ సంగీతానికి దివ్య సింహాసనాలు నమర్చారు. అక్బర్ పరిపాలన హిందూ ముస్లిం మత సామరస్యానికి సమైక్యతకీ బాటలు వేసింది. అతని అభిమతం సర్వ మత సార సంగ్రహంగా రూపొందింది. అభినవ జీవిత దృక్పథంతో సంగీతాది కళలను సముద్ధరించాడాయన. అదే మొదలుగా సంగీత కళలో హిందూ ముస్లింమత వైషమ్యాలు పూర్తిగా సమసిపోడానికి పథ నిర్దేశం జరిగింది.

బడేగులాం కుటుంబంలోని సంగీత వేత్తలు సుమారు అక్బర్ కాలంనుంచి పరిఢవిల్లుతూ వచ్చినవారే! ఇలాంటి ఉత్తమ సంప్రదాయపు పాదులో పుట్టి ఆకాశమంత పందిరిపై విస్తరించిన బడేగులాం కు హైందవీయమైన భక్తి భావన వెన్నతో పెట్టిన విద్యగా రూపొందింది. పైగా ఎలాంటి గంభీర భావాభివ్యక్తినైనా సునాయాసంగా ఉత్తాలరమణీయంగా పలుకగలిగే శారీరం వీరి సొమ్ము! ఆకార సాధనంలో ఈయనది ప్రథమ తాంబూలమే. సర్వవిధాలా స్వాయత్తమైన కంగ కంఠమాధుర్యంతో (Seasoned voice) పరిపక్వ స్ఫుటమైన స్వర జ్ఞానంతో రసభావాలు చిప్పిల్ల చేయడంలో అబ్బురమేముంది! అందుకే మీరా, సూరదాస్, కబీర్, తులసీదాస్, వంటి భక్త గాయకుల భజనలను ఎంతో సాహిత్యాభివ్యక్తితో రససిద్ధితో గానం చేసేవాడాయన. గోపాలనాయక్ బైజుబావరా, వంటివారి సంగీత రచనలనెంతో పరిశోధించి అద్భుత అవగాహనల సంతరించుకొన్నాడాయన.

వివాది స్వరాలను సైతం ఎంతో గడసరి తనంతో విలీనంచేసి రసోత్పాదన కలిగించేవాడు, లయజ్ఞానం ఈయన సొమ్ము. ఎలాంటి క్లిష్టమైన కర్ణాకటరాగాన్ని వినిపించినా వెంటనే స్వరకల్పన చేసుకొని సద్యస్ఫూర్తితో పాడి వినిపించగలిగే వాడు.

**అపురూప సంఘటనలు**

1921 లో లక్నోలో గొప్ప సంగీత పరిషత్ జరుగుతోంది. ఆ పరిషత్ లో అల్లా బంద్ ఖాఁ గారి సమక్షంలో బడేగులాం గానం చేశాడు. పోటీలో ప్రథమశ్రేణిలో ఎన్నిక చేయబడ్డాడు, సువర్ణపతకాన్ని బహుమతిగా పొందాడు. 1940లో కలకత్తాలోనూ, 43లో గయలోను, 44లో బొంబాయిలోనూ ఘనసన్మానాలు జరిగాయి. అదే సంవత్సరం అలహాబాద్, పాట్నా, రాజ్ షాహి పరిషతులలో కూడా ఘన సన్మానాలందు కొన్నాడాయన. 1945లో మహాత్మాగాంధీ సమక్షంలో భజన గీతాలు గానం చేసి వారి అభినందనలందుకొన్నారు.

ఇతని గానాన్ని విని ఆఫ్ఘన్ సుల్తానులు ఎంతో ముగ్ధులయ్యారు. నాదిర్ షాగాని, అతని కుమారుడు జారిజ్ ఖాఁగాని బడేగులాం గానాన్ని అమితంగా అభిలషించి ఎన్నో విలువైనకానుకల సమర్పించారు. వీరిని తమ దర్బారులో ఎలాగైన ఆస్థాన విద్వాంసులుగా ఉండిపోవలసిందిగా బ్రతిమాలుకున్నారు. కాని ఆయన సమ్మతించలేదు.

అసమాన సంగీత సంప్రదాయానికి ఆటపట్టయిన భారతదేశం పట్ల ఆచంచల భక్తి విశ్వాసాలవల్ల నే తిరిగి స్వదేశానికి వచ్చేశారాయన!

1962లో ఈయనకి భారత ప్రభుత్వం రాష్ట్రపతి అవార్డునిచ్చి సత్కరించింది.

1968 నాటికి బడేగులామ్ తన 65వ ఏట బొంబాయి మలబార్ హిల్సులో స్వగృహాన్ని సంపాదించుకుని స్థిరపడ్డారు. అంత వయస్సు వచ్చినా ఆయన తెల్లవారుఝామున చలి ప్రొద్దుల్లో నిద్ర మేల్కొని కంఠ నాదాన్ని ఏకాంత శూన్యంలో సుళ్లు తిప్పుతూనే ఉండేవారు.

**నిరాడంబర వ్యక్తిత్వం :**

బడేగులాం నిజంగా నిరాడంబరజీవి. ఆయన ప్రవర్తనలో ఎన్నడూ గొప్పలను ప్రదర్శించుకోవడంగాని, లేనిపోని భేషజాన్ని ప్రదర్శించుకోవడంగాని కనిపించేది కాదు.

ఎవరికైనా ఏచిన్నఆపద కలిగినా కరిగి నీరయి పోయే హృదయ వైశాల్యమూ, మార్దవత్వమూ ఆయన సహజ లక్షణాలు. ఉర్దూలో మొదటి తరగతి పాఠాలనైనా చదవలేదని ఆయన చాలా నిరాడంబరంగా చెప్పుకొనేవారు. కాని పాకిస్తాన్ విడిపోవడం జరిగాక ఆయన పాటియాలా నుంచి బొంబాయికి మకాం మార్చుకొన్నారు. బొంబాయి వచ్చాక మరికొంత విద్యాభ్యాసం అవసరమనిపించి, చదువు చెప్పించుకోనారంభించారు.

ఆయన గానకళను ధనార్జనకోసం వినియోగించుకొన్నవారు కాదు. సంగీత ప్రచారమే ప్రధానాశయంగా స్వీకరించాడు. విద్యార్థుల ఉపయోగార్థం ఏ కళాశాలవారైనా గానంచేయడానికి పిలిస్తే బేషరతుగా అంగీకరించి, విద్యార్థులకోసమని ప్రత్యేక వివరాలతో సహా గాన ప్రదర్శన చేసేవారు.

ఏ మిత్రుడైన ఏ సందర్భంలోనైన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తే నిరభ్యంతరంగా వెళ్లి హాయిగా పాడి మరీ వచ్చేవాడాయన!

ఆయనవద్దకు అర్థులై వచ్చిన నిర్భాగ్యులను విరివిగా సత్కరించి పంపేవాడు. దానదర్మాలు పౌరుని సాంఘిక బాధ్యతగా తరుచు చెబుతూ ఉండేవారు,

"ఎక్కడా రాయబడనివీ, ఈ వ్యాసకర్త స్వయంగా విన్నవీ... బడేగులామ్ గారి వ్యక్తిత్వం గురించిన కొన్ని సంగతులు వివరించుకోవడం బేసబబుకాదు. అదృష్టవశాత్తూ ఈ రచయితపట్ల గాఢాభిమానంచూపిన ప్రథమశ్రేణి కళాకారులు స్వర్గీయ వాసా కృష్ణమూర్తిగారు. వీణావాదనలో హిందూస్థానీ కర్ణాటక సంగీతాలనొకే ప్రతిభతో ప్రదర్శించగలిగే ఏకైక మహావ్యక్తి ఆయన. బడేగులామ్ పట్ల ఆయనకు అపార భక్తి ప్రపత్తులుండేవి. అలాగే బిస్మిల్లా అన్నాను! విశాఖ మ్యూజిక్ ఎకాడమీకి శ్రీ వాసా కార్యదర్శిగా ఉండే రోజుల్లో బడేగులామ్ ను ఆహ్వానించి కచేరీ ప్రారంభంలో ఆయన గాన వైశిష్ట్యాన్ని పరిచయం చేస్తూ హిందీలో చక్కని ఉపన్యాసమిచ్చారు. ఉపన్యాసానంతరం ఆయన పాదాలకు సాగిలపడి నమస్కరించగా "బ్రాహ్మణ జన్మ ఎత్తి తురకవాడికి పాదాభివందనం చేస్తావా? అంటూ ఛాందసులు ఈసడించారట. ఆయన జన్మరీత్యా ముస్లిమ్ అన్నదే ఈ పురుగులకు తెలుసుగాని – ఆయన సరస్వతీ స్వరూపుడని ఎలా తెలుస్తుంది వీళ్ళకి? అని కంఠోక్తిగా

చెబుతూంటే, శ్రీ వాసా గొంతు గాద్గదికమై కన్నులు అశ్రుపూరితాలయ్యేవి. అప్పటికి బడేగులామ్ కు పక్షవాతవ్యాధి సోకి నిమ్మళించింది, కాని దక్షిణ బాహువు నిరుపయోగమై చచ్చుపడిపోయింది. ఆ వేళ కచేరీలో ఒక తారస్థాయిలో అపశ్రుతి పడిందట. వెంటనే బడేగులామ్ – గానం ఆపి. కష్టంమీద చేతులు రెండూ జోడించి – "క్షమించండి. జబ్బుపడి బ్రతికాను. నాగానం ఖరాబవుతోంది. మాఫ్ కీజియే!" అంటూ హిందూస్తానీలో సభాసదులను హృదయపూర్వకంగా ప్రార్థించారట. ఈ అంశాన్ని శ్రీ వాసా ఎంతో ఆక్రోశంతో చెబుతూ – "మన గాయకులు అపశ్రుతులు పడినా – సదస్యులు గుర్తించారేమిటిలే అన్న నిబ్బరంతో రోలర్ లాగించేస్తారు. ఈ మహనీయుని వినయం చూశారా?"

"బడేగులామ్కా గులామ్" గా ప్రస్తుతింప బడినవారు మన వోలేటి వెంకటేశ్వర్లుగారు. ఆయన ఆదర్శ గాయకుడు బడేగులాంకు వలెనే ఈయనకూ వినయసంపద భూషణంగా అలరారుతుందని శ్రీ వోలేటిని ఎరిగినవారందరికీ తెలుసు. ఈ వ్యాసకర్తతో ఆయన మరో సంఘటన చెప్పారు; ఒక సంగీత సదస్సులో గొప్ప గొప్ప నవాబులెందరో ఆశీనులై ఉన్నారట. వారంతా తమ సంగీత జ్ఞానాన్ని ప్రదర్శించుకుందుకు ఏవో పురమాయింపులు చేస్తున్నారట. పాపం బడేగులామ్ కు మనసు బాధపడింది. తనలో రేగిన కోపాన్ని అణచుకొని మెత్తగా యిలా అన్నారట! "ఇక్కడ మహనీయులైన నవాబు లెందరో ఉన్నారని నాకు తెలుసు. పేరును బట్టికూడా నేను అందరికీ గులాంనే. కాని నేను ఈ నవాబులంటే కించిత్తూ భయపడే వ్యక్తిని కాదు. ఒక్క సప్తస్వరాలకుమాత్రమే తీవ్రంగా భయపడతాడీ వ్యక్తి. ఏ కళాకారుడికన్నా కూడా ఆ కళ మహత్తరమైంది. క్షమించండి." అన్నారట. ఈమాట లెంత మెత్తగా ఉన్నా, అంత నిసితాయుధాలై తెలుసుకోగలిగిన వారిని దొలచక మానవు !" ఆయన హృదయం ఎంత దీక్షాబంధుర మైనదైనా వాక్కు అంత సుమకోమలంగా ఉండేది. ఆయన మూర్తి ఎంత భయంకరమో, వ్యక్తిత్వం అంత కరుణాకరం!

సంగీత శాస్త్ర సంబంధమైన వాదోపవాదాలంటే ఆయనకు సుతరామూ గిట్టేదికాదు. సంగీతం వాదోపవాదాలకూ తర్కానికీ కాదనీ అది నిర్మలమైన, అనుభవైక వేద్యమగు కళ అనీ ఆయన చెప్పేవారు. పాడి వినిపించడం ద్వారా రసస్ఫూర్తి కలిగించడమే సంగీత వేత్త కర్తవ్యం! కేవల వాదోపవాదాలు కళానుభూతికి ప్రతిబంధకాలు – అనేవారాయన!

**కళాకారుని సంతానం :**

బడేగులాంకి ముగ్గురు కుమారులు. అందులో మొదటి ఇద్దరూ పాకిస్తాన్ కు వలసపోయారు. వంశపారంపర్యా వస్తున్న సంగీతాన్ని పరిత్యజించారు. ఏవో లౌకిక వృత్తులతో జీవిస్తున్నారు. మూడవ కుమారుడు మనావర్ ఆలీఖాఁ మాత్రం – ఉత్తమ గాత్ర ధర్మంతో వర్ధమాన గాయకుడుగా తండ్రి అడుగుజాడల్లో పయనిస్తున్నాడు. పరిపక్వ గాయకుడుగా రూపొంది గొప్ప తండ్రికి గొప్ప తనయుడుగా ప్రతిష్ఠ నిలుపుకుంటాడు. బడేగులాం సజీవులై ఉన్నంత కాలం వారితో పాటు సహకారగానం నెరపేవాడు. తదుపరికాలాన కూడా పాటియాలా సంప్రదాయాన్ని పరిపోషిస్తూ పురోగమిస్తున్నాడు.

తనూజుల మాట చెప్పిన తర్వాత మానస పుత్రుల గురించి కూడా చెప్పుకోవడం అవసరం. బడేగులాంకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూకూడ అసంఖ్యాకంగా శిష్యులు ఉన్నారు. ప్రత్యక్ష శిష్యులు ఆయన పాదాలవద్ద కూర్చుని విద్య నేర్చుకున్నవారు. పరోక్ష శిష్యులు ఆయన గాన ప్రభావాన్ని తమలో రంగరించుకొని – తమబాణీకి కొత్త వెలుతురు రేకు లద్దుకున్న వారు. ఆయన మొదటిరకం శిష్యులలో – సర్వశ్రీ రమేష్ చంద్ర ఠాకూర్, సాయిగళ్, తులసీదాస్ శర్మ, చిన్మయ్ లాహిరీ ప్రభృతులూ, శ్రీమతి మీరా బావర్జీ మున్నగు విదుషీ మణులూ ముఖ్యులు. వర్తమాన సంగీతాకాశంలో ఉజ్జ్వలతారగా ప్రకాశిస్తున్న కుమారి పర్వీన్ సుల్తానా – విద్యాపరంపరలో బడేగులాంకు మనుమరాలువంటిది ! వీరుగాక యావద్భారతంలోనూ వీరికి ఏకలవ్య శిష్యులెందరో ఉన్నారు !

**విషాదాంతం:**

ఈయహనీయ సంగీత తపస్వికి 1960 లో పక్షవాత వ్యాధి సోకింది. ఆయన అభిమానులకు తీవ్రఘాతం కలిగింది. బడేగులామ్ భవిష్యత్తులో యిక పాటకు అనర్హులై పోతారేమోనని అంతా భయపడ్డారు. కానీ అందరికీ ఆశ్చర్యం కలిగించే రీతిగా హస్పిటల్లో చేరిన మూడవరోజునే – ఆయన తానం పాడ నారంభించారు. గానం పట్ల ఆయనకు గల తీవ్రాభినివేశమే ఆయన్ని త్వరలో కోలుకొనేటట్లు చేసింది, శారీరకంగా కొంచం అవధ్యత వ్యాపించినా ఆయన గళం మాత్రం మూగపోలేదు.

మళ్ళీ ఆయన దేశ దేశాలలో అపారంగా పర్యటించారు. అనేకపర్యాయాలు ఆఫ్ఘనిస్తాన్ వెళ్ళి వచ్చారు.

దురదృష్టవశాత్తూ ఆయనకు కంఠంలో కేన్సర్ వ్యాధి సోకింది. కేన్సర్ కు అనేక కారణాలు చెబుతూంటారు. ఎన్నో కారణాలు విస్తారంగా ఉండే అనేకులకెందుకు రాదో. ఏ కారణంలేని రామకృష్ణ పరమహంసలాంటి వారికికూడా ఎందుకు వచ్చిందో వైద్యశాస్త్రం వివరించలేదు.

ఈదుర్వార్త విన్న నిజాం నవాబు ఒస్మాన్ ఖాఁ వెంటనే ఆహ్వానం పంపాడు. బడేగులాం సంగీతమంటే నిజాం నవాబుకు ఎంతో ప్రీతి! హైదరాబాద్ లో చికిత్స పొందడానికి రావలసిందని, వైద్యసంబంధమైన ఖర్చులన్నీ తాను భరించగలననీ తెలిపాడు. వైద్య సహాయం చక్కగా అందించబడింది. గొప్ప వైద్యులు పిలిపించబడి, గొప్ప చికిత్స జరిగింది. కాని వైద్యులు "ఇంక గానంచేయరాదు" అన్నారు. గాయకధర్మం పాటించని బ్రతుకే వ్యర్థమనీ, పాడకుండా తాను బ్రతక లేనని బడేగులాం స్పష్టపరిచారు. చికిత్స వల్లనైతేనేం. ఆయన సంకల్పంవల్లనైతేనేం కేన్సర్ నిమ్మళించింది. మళ్ళీ కచేరీలు చేయనారంభించారు. దేశమంతటా మళ్ళి పర్యటించారు.

కాని దురదృష్టవశాత్తు కేన్సర్ వ్యాధి మళ్ళీ తలెత్తింది. జాతికొక మహా గాయకుడు లేకుండా పొట్టను పెట్టుకుంది. అమరగాయకుడు బడేగులాం ఆలీఖాఁ తన డబ్బదియవ జన్మదినం చేసుకోకుండానే స్వర్గస్తులయ్యారు. ఆయన గానం మాత్రం అజరామరంగా తరతరాలుగా రసికులకు అమృత ప్రదానం చేయగల్గుతుంది!

(బడేగులాం జయంతి సందర్భంగా గానకళ పూర్వ సంచికలనుండి ఈ వ్యాసం మునర్ముద్రించడమైనది.)

# విదుషి శ్రీమతి కాకటూరి పద్మావతి సంగీత రచనల పరిమళాలు



– ఆకొండి శ్రీనివాసరాజారావు
సెల్ : 9441238911

సాక్షాత్తూ కామాక్షీదేవి అవతారమై, నడిచే దైవమై కంచికామకోటిపీఠాధీశులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారు ఒక పర్యాయం ఆంధ్రదేశయాత్ర చేస్తూ, మచిలీపట్నం విచ్చేశారు. స్వామివారికి స్వాగత సత్కారాలు చేసేందుకుచాలా మంది పురప్రముఖులు విచ్చేశారు. వారిలో ఒక వాగ్గేయకారిణి కూడా ఉన్నారు. ఆమె 'భిక్షాటనము' అనే స్వీయ కృతిని గానం చేయగా స్వామివారు విని పరమానంద భరితులయ్యారు. కంచి కామాక్షిపై కొన్ని కృతులను రచించమని స్వామివారు ఆ వాగ్గేయకారిణిని కోరారు. వారి ఆజ్ఞను శిరసావహించి ఆ వాగ్గేయకారిణి 'కామకోటి కామాక్షి', 'జగన్మాతకామాక్షి', 'చెలువమీర' అనే కృతులు రచించి మరుసటి రోజునే స్వామి వారికి పాడి వినిపించారు. స్వామివారు ఎంతో సంతసించి ఆ వాగ్గేయకారిణికి తమ ఆశీస్సులను అందించారు.



జగద్గురువుల అమోఘమైన ఆశీస్సులను పొందిన ఆ ఘన వాగ్గేయకారిణి కాకటూరి పద్మావతి.

పద్మావతి పూర్వీకులది నెల్లూరు. అయితే పద్మావతి మాత్రం మచిలీపట్నంలో 1915 లో అనంతనామ సంవత్సరం మాఘ బహుళ చవితి రోజున జన్మించారు. వీరిది ఉత్తర ఫల్గుణీ నక్షత్రం, అభిజిత్ లగ్నం. నియోగి బ్రాహ్మణ శాఖకు చెందిన వీరి గోత్రం భారద్వాజస.

వీరి తల్లితండ్రులు తులశమ్మ, మల్లవరపు వెంకటరమణయ్య. తండ్రి వృత్తి రీత్యా సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ లో సూపరెంటెండెంట్. అంతేకాకుండా గొప్ప ఆధ్యాత్మిక వేత్త. అనేక ఆధ్యాత్మిక విషయాలపై ప్రవచనాలు ఇచ్చేవారు. 'ఆనందానుభవము', 'జీవాత్మ–పరమాత్మ', 'అద్వైతసాధన పరిచయము' వంటి అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారు. వీరు ఉద్యోగ విరమణానంతరం సన్యాసాన్ని స్వీకరించారు. వీరి ఆశ్రమం హైదరాబాదులో నెహ్రూ జూలాజికల్ పార్కు వద్ద ఉన్నదట. వీరు వంద సంవత్సరాలకు పైగా జీవించారట. వీరి సమాధి వీరి ఆశ్రమంలో ఉన్నదట.

పద్మావతి తల్లిదండ్రులకు ఏకైక పుత్రిక

కావడం వలన ఎంతో గారాబంతో పెంచి, చదువుతో పాటు సంగీతమూ నేర్పించారు. పద్మావతి అమ్మమ్మ, పద్మావతికి పది పన్నెండేళ్ళ వయసులోనే నిత్యం పోతన భాగవతాన్ని చదివి, అర్ధ తాత్పర్యాలను, అంతరార్థాలను కూడా వివరించేవారు. పద్మావతి లంకా నరసింహశాస్త్రుల వద్ద సంస్కృతాన్ని, మద్రాసు వాస్తవ్యులు, తమిళులు అయిన పి.ఎమ్. చొక్కనాయకీ అమ్మాళ్ వద్ద వీణా వాదనాన్ని అభ్యసించారు. పద్మావతికి చిరుతప్రాయంలోనే భక్తి బీజాలు నాటుకొన్నాయి. అంతేకాకుండా; సంస్కృతంలోనూ, సంగీతంలోనూ ఎంతో ప్రావీణ్యత లభించింది. వాగ్గేయ కారిణిగా రూపొందడానికి ఇంతకన్నా కావలసిన అర్హతలు ఇంకేముంటాయి.

పద్మావతికి వివాహం రాధాకృష్ణయ్యతో జరిగింది. వీరి భర్త కూడా, వీరి తండ్రి లాగే సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ లో ఆఫీసరుగా పనిచేసారు. పద్మావతికి భర్త ప్రోత్సాహం బాగా ఉండడం చేత ఎంతో ఉత్సాహంగా ఎన్నెన్నో సంగీత రచనలు చేసారు. వీరికి సంతానం లేకపోవడం వలన పిల్లలను పెంచుకొని వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. మచిలీపట్నంలో వీరికి చాలా పెద్ద భవంతి ఉండేది. దీనికి 'కౌస్తుభం' అని పేరు పెట్టుకొన్నారు. ఈ కౌస్తుంభం నుండి ఎన్నెన్నో సంగీత రచనల కాంతులను వెదజల్లారు పద్మావతమ్మ. వీరు చాలా సంవత్సరాలు మచిలీపట్నంలో నివసించాక, హైదరాబాదుకు మారారు. అక్కడ వీరి మేనల్లుని వద్ద ఉండేవారు. వీరి మేనల్లుడు ఐ.ఏ.స్. ఆఫీసర్.

పద్మావతికి వివాహం అయిన రెండు సంవత్సరాల తరువాత ఒక మహాత్ముడు ఈమెకు, ఆది శంకరాచార్య విరచిత అన్నపూర్ణాష్టకాన్ని ఉపదేశించారు. ఈమె అనుదినం శ్రద్ధాభక్తులతో, నిష్టతో అష్టకాన్ని పఠించేవారు.

ఒక పర్యాయం కుటుంబం అంతా కలసి కాశీ, హిమాలయాలలోగల క్షేత్రాలను దర్శించేందుకు వెళ్ళారు. కాశిలో అన్నపూర్ణదేవిని మనసారా అర్చించే భాగ్యం పద్మావతమ్మకు లభించింది. ఈయాత్రలకు వెళ్ళి వచ్చిన ఒక సంవత్సరం తరువాత ఒక రోజున కాశీపురాధీశ్వరి, మాత అన్నపూర్ణేశ్వరి పెద్ద ముత్తైదువ రూపంలో స్వప్నంలో దర్శనమిచ్చారు. ఘనతగల స్వరసాహిత్య సంపుటీకరణతో కృతులను రచించమని ఆదేశించి, ఆశీర్వదించారు. ఈ విధంగా అమ్మదయకు పాత్రురాలైన గొప్ప వాగ్గేయకారిణి పద్మావతమ్మ. అమ్మదయ ఉంటే కృతిరచన నల్లేరుపైన నడకేకదా!

ఆ మరుసటి రోజునే కల్యాణి రాగంలో ఆదితాళంలో 'శ్రీరాజరాజేశ్వరి శ్రీకరిశంకరి పాహి' అనే కృతి పద్మావతి గళం నుండి వెలువడింది. అప్పటినుంచీ ఇంక ప్రవాహంలా కృతులు, కీర్తనలు మొదలైన ఎన్నెన్నో సంగీత రచనలు ఆమె నుండి జాలువారాయి. ఆమె కృతి రచన చేసే ముందు ధ్యానం చేసేవారట. ఆ ధ్యానంలో, ఆ తాదాత్మ్య స్థితిలో ఆమెనుంచి కృతి వెలువడేదట. ఆమె వీణవాయించుకొంటున్నా, లేక పాడుతున్నా కూడా సమాధి స్థితిలో ఉన్నట్లుగా ఉండేవారట. చుట్టుపక్కల ఏమి జరుగుతున్నా ఆమెకు తెలిసేదికాదట. వివిధ క్షేత్రాలను సందర్శించినప్పుడు ఆయా దేవీ

దేవతలపై కృతులను కూర్చడం పరిపాటి అయ్యింది. ఎటువంటి పేరు ప్రఖ్యాతులకోసం, కచేరీలకోసం వెంపర్లాడకుండా భగవంతుని సేవగా భావించి కృతిరచన చేసిన భక్త వాగ్గేయకారిణి పద్మావతమ్మ. ఈమెలో ఒక దివ్యమైన శక్తి ఉండేది. ఆశక్తి ఆమె చేత మూడవందలకు పైగా సంగీత రచనలు చేయించింది. వీరి రచనలు రాసిలోనే కాదు వాసిలో కూడా ఎన్నదగినవి.

ఈమె చేతివ్రాత ఎంతో అందంగా ఉండేదట. ఈమెకు 'సంగీత చూడామణి' అనే బిరుదు ఉండేది.

ఒకసారి వీరు మచిలీపట్నంలో ఉండేటప్పుడు మంచినీరు లేక చాలా ఇబ్బంది పడ్డారట. ఎంత ప్రయత్నించినా వారి ఇంటికి మునిసిపాలిటీవారు కుళాయి వేయలేదట. అప్పుడు పద్మావతమ్మ 'శివుని శిరసుపైని చిందులాడే గంగ' అనే కీర్తనను రచించి పాడారు. అచిరకాలంలో వారి నీటిసమస్య తీరిపోయిందట. ఈ కీర్తన పల్లవిని జంఝూటి రాగంలోనూ, చరణాలను పున్నాగవరాళి రాగంలోనూ రచించారు. నీటి ఎద్దడి గల ప్రాంతాలలో ఈ కీర్తన పాడినప్పుడు నీటి కరువు తీరిపోతుంది అనడంలో ఏ మాత్రమూ సందేహం లేదు. అంతటి శక్తిగల కీర్తన ఇది.

ఒకసారి పద్మావతమ్మ వేంకటేశ్వరస్వామిపై ఒక కీర్తనను రచించారు. ఈ కీర్తనలో వారు స్వామివారికి అలంకరించే వివిధ ఆభరణాలను పేర్లతో సహా పేర్కొన్నారు. అయితే ఈ పేర్లు ఆమెకు ముందుగా తెలియవు. ఈ ఆభరణాలన్నీ నిజంగా ఉన్నాయా? లేదా అని తరువాత పరిశీలించి చూస్తే, ఈమె కీర్తనలో పేర్కొన్నవన్నీ స్వామి అలకంరణలో నిజంగా ఉన్నాయి. పద్మావతమ్మకు ఆ వేంకటేశ్వరుడే ఈ ఆభరణాలన్నింటిగురించి తెలియజేసి ఆ కీర్తనను రచింపచేయించాడు.

పద్మావతమ్మ 2000వ సంవత్సరంలో తమ 85 వ ఏట అమ్మలో ఐక్యమయ్యారని వికీపీడియాలో కనిపిస్తోంది. అయితే వీరు 92 సంవత్సరాల వరకూ జీవించి ఉన్నారని తెలుస్తోంది. వీరి భర్తగారు నిండు నూరేళ్ళూ జీవించారట. పద్మావతమ్మ వృద్ధాప్యంలో ఉన్నా కూడా తమపని తామే చేసుకొనేవారట. అంతేకాకుండా భర్తకు కూడా ఎంతో సేవ చేసేవారట.

మచిలీపట్నానికి చెందిన సంగీత విదుషిమణులు, శ్రీమతులు నీతా చంద్రశేఖర్, శేషులత గారలు పద్మావతమ్మతో ఎంతో సాన్నిహిత్యాన్ని కలిగి ఉండేవారు. వీరిద్దరూ పద్మావతమ్మనుంచి, అమ్మ సంగీత రచనలను నేర్చుకొన్నారు. శేషులత, వారి శిష్యులకు కూడా నేర్పించి అమ్మ ముందు పాడించారు. శేషులత టి.వి. రికార్డింగ్స్ లనూ, కచేరీలలోను వీరి కీర్తనలు గతంలో గానం చేశారు.

పద్మావతి అమ్మ, వర్ణాలు, కృతులు, కీర్తనలు, తిల్లానాలు, రాగమాలికలు, కోలాటగీతాలు, లాలిపాటలు, మేలుకొలుపులు, మంగళహారతులు, లలితగీతాలు, దేశభక్తి గీతాలు, జానపదగీతాలు, తత్త్వాలు, గొబ్బిపాటలు, పడవ పాటలు, హరికథలు, బుర్రకథలు, నృత్యరూపకాలు, సంగీత రూపకాలు ఇలా ఎన్నెన్నో రకాల సంగీత రచనలు చేశారు. ఇన్ని రకాల సంగీతరచనలు చేసినవారు చాలా అరుదుగా

మాత్రమే ఉంటారు. 'పద్మావతీనుత' 'పద్మార్చిత' అనే ముద్రలు వీరు ఉపయోగించారు. వీరు రచించిన కొన్ని మంగళహారతులు, కీర్తనలు, ఇంకా 'శరద్రాత్రి', 'సత్యభామ', 'లక్ష్మీపూజ' వంటి కొన్ని సంగీత రూపకాలు ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి 1964 ఆ ప్రాంతంలో ప్రసారం అయ్యాయి, వీరు సంస్కృతంలోనూ, తెలుగులోనూ రచనలు చేసారు. వీరి రచనల్ని వీరే 'సంగీత రత్నమాల', 'సంగీత కదంబమాల', 'సంగీత వైభవమాల' అనే మూడు గ్రంథాలుగా ప్రచురించారు. వారి కీర్తనలకు వారే నొటేషన్ వ్రాసి, స్వరంతో సహా ఈ గ్రంథాలను ముద్రింపించారు. వీరి సంగీత గ్రంథమైన 'సంగీత కదంబమాల'లో వీరు రచించిన నృత్యరూపకాలు ఉన్నాయి. వీరి నృత్యరూపకాలను ప్రముఖ నర్తకీమణి ఉమారామారావు తదితరులు ప్రదర్శింపచేసారు. శ్రీమతి నీతా చంద్రశేఖర్ పద్మావతి గారి కీర్తనలతో 3 గంటలకచేరీ గతంలో చేసారు.

వీరి 'సంగీత రత్నమాల' నిజంగా రత్నాల వంటి సంగీత రచనల మాలే. ఈ గ్రంథంలో యాభై కృతులు, పదిరాగమాలికలు, రెండు తిల్లానాలు, మూడు వర్ణాలు, పన్నెండు కీర్తనలు, ఐదు వేణుగానము గోపికా గీతములు, పదిహేను మంగళ హారతులు, రెండు జోలపాటలు ఉన్నాయి. ఈ గ్రంథానికి అనుబంధంలో కూడా కొన్ని సంగీత రచనలు ఉన్నాయి. ఈ అనుబంధంలో కాశీనగరవర్ణన, పార్వతినాట్యం, శబరిస్తుతి, మహాలక్ష్మిస్తుతి, గుహుని కీర్తన, రెండు జానపదగీతాలు, లలితగీతం, ఐదు కీర్తనలు, రెండు తత్త్వాలు, ఒక దేశభక్తి గీతం, గొబ్బిపాట, కోలాటగీతం గంగపాట, కృష్ణసుప్రభాతం, ఉదయవర్ణన, ఎనిమిది మంగళహారతులు ఉన్నాయి. ఈ అనుబంధంలోని సంగీత రచనలకు తప్ప మిగిలిన సంగీత రచనల్నీ స్వరసహితంగా ఉన్నాయి. తనకు స్వప్నంలో కనిపించి, కీర్తనలు రచించమని ఆదేశించిన అన్నపూర్ణాదేవికి "మా దంపతులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించమని" కోరుతూ ఈ సంగీత రత్నమాలను అంకితమిచ్చారు పద్మావతి. అన్నపూర్ణాదేవికి అంకితమిస్తూ అమ్మవారిపై వీరు పంచరత్నాలను రచించారు. ఈమె ఎంత గొప్ప వాగ్గేయకారిణో తెలియడానికి ఈ ఒక్క కీర్తనను చూస్తే చాలు. 'గౌరి', 'లలితగౌరి', 'ఛాయాగౌరి' 'సింధుగౌరి', 'మంగళగౌరి' ఈ ఐదు 'గౌరీ' రాగాల మాలిక ఈ రచన. ఈ రాగాలన్నీ అపురూపరాగాలే. రచన సంస్కృతంలో సాగింది. ఈ పంచరత్నాలను మీరు కూడా పరిశీలించండి.

**గౌరి రాగం**

1. మయే అభయే మహేష జాయే
మామవ కరుణారస హృదయే
కలయే మనోజ్ఞ మౌక్తికచ్ఛాయే
రాకాశశినిభ కాంతిమయే.

**లలితగౌరి రాగం**

2) విజయే! వీణశంఖవేణు
మురజ మృదంగ నాదప్రియే
గేయే! ఋగ్యజు సామాధర్వ
వేద సుధా రస దివ్యకాయే

### ఛాయాగౌరీ రాగం

3) ఉదయే! హిమగిరితనయే ఊర్జిత
వారణాసి నగరాంతరాలయే
జ్ఞేయే! ఈశ్వర కటాక్ష నిలయే
అన్నపూర్ణ సార్థనామధేయే

### సింధుగౌరీ రాగం

4) మరకత వ్రజనాగకుండల
సువర్ణమాలా మణి వలయే
పరిమళ కుంకుమ విభూతి చంద
నాలంకృత లావణ్య మయే

### మంగళగౌరీ రాగం

5) అయే! భవాబ్ధితరణోపాయే
జాగ్రత్స్వప్న సుషుప్తి తురియే
ధ్యేయే! మునిజన వినుతే సదయే
పద్మార్చిత శుభ పాదద్వయే

ఈ కీర్తన, రచనా విధానాన్ని పరిశీలిస్తే ముత్తుస్వామి దీక్షితర్ ప్రభావం మనకు కనిపిస్తుంది. ఈమె కీర్తనలలో రాగముద్ర, క్షేత్రముద్ర, మధ్యమకాల సాహిత్యాలు కనిపిస్తూ దీక్షితార్ ప్రభావాన్ని ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తాయి.

వినాయకునిపై 'కాత్యాయనీ తనయం సతతం భజేహం' అనే కృతిని మాయామాళవగౌళరాగంలో రచించారు. సంగీత విద్యార్థులు తొలి పాఠాలు నేర్చుకొనే మాయామాళవగౌళ రాగంలో తొలి పూజలుఅందుకొనేవినాయకునినుతించడంవిశేషం. 'మాయా మాళవ గౌళ మంజులనాదానందం' అంటూ చరణంలో రాగముద్రను ఉపయోగించారు.

'మహాదేవనాయకీ బృహదీశ్వరీ అంబ' అనే కృతి 'నాయకి' రాగంలో త్రిపుట తాళం లోనిది. ఈ కృతి పల్లవిలోనే 'నాయకి' రాగముద్ర వచ్చేలా రచించారు. ఇలా చాలా కృతులలో రాగముద్రలు కనిపిస్తాయి.

పద్మావతి తొలి కృతి 'శ్రీరాజేశ్వరి శ్రీకరి శంకరి పాహి' కల్యాణి రాగంలో రూపకతాళంలో అన్నపూర్ణాదేవి స్తుతి. ఈ కీర్తన అనుపల్లవిలో 'వారణాసి పురవాసిని వాంఛితార్థఫలదాయిని' అంటూ క్షేత్రముద్ర, చరణంలో 'కల్యాణి కలభాషిణి కమనీయ భూషణమణి' అంటూ రాగముద్ర వృత్యనుప్రాస కనిపిస్తాయి.

చ॥ కైలాస విహారిణి కనక మకుట ధారిణి
కామకోటి భక్తాశ్రిత చరణే పాలయమాం
కల్యాణి కలభాషిణి కమనీయ భూషణ మణి
అఘవారిణి భవతారిణి విశాలాక్షి జగజ్జనని.

త్యాగరాజస్వామిని నుతిస్తూ, పద్మావతి హిందోళరాగంలో త్రిపుట తాళంలో కృతిని కూర్చారు. 'పొగడరాదటే మనసా త్యాగరాజగురు మహిమను' అని పల్లవిని ప్రారంభించి, త్యాగయ్యను ఏ విధంగా పొగడాలో అనుపల్లవిలోనూ, చరణాలలోనూ తెలిపారు. 'రామజపము చేసి భవార్ణవము తరియించెనని – నారదముని వలన స్వరార్ణవ కావ్యము బడసెనని' అంటూ త్యాగయ్యను పొగడాలని రచించడం ఎంతో సముచితంగా ఉంది. ఈ రచనా పద్ధతి త్యాగరాజ స్వామి రచనా విధానాన్ని పోలి ఉంది.

అంత్యప్రాసలు, వృత్యనుప్రాసలు, ద్వితీ

యాక్షర ప్రాసలను తమ కృతులలో పొందు పరచి కృతులకు ఎంతో అందాన్ని చేకూర్చారు.

పద్మావతమ్మ పళనిలోని బాలసుబ్రహ్మణ్య స్వామిని దర్శించినప్పుడు బిలహరి రాగంలో ఆదితాళంలో రచించిన కీర్తనలో సుబ్రహ్మణస్వామిని ఎంతో మనోహరంగా వర్ణంచారు. ఈ కీర్తన విన్నా చదివినా మనకు కూడా స్వామిని దర్శించిన అనుభూతి తప్పకుండా కలుగుతుంది. ఆ కీర్తనను గమనించండి.

**బిలహరి – ఆది**

ప॥ బాలసుబ్రహ్మణ్య స్వామిని నా
భాగ్యవశము చేత గంటి, నిపుడు ॥బా॥

అ॥ ఫాల భాగమున దీర్చిన పరిమళ
చందన విభూతులతో
గళమున మెరయు రుద్రాక్ష
సరులతో కరుణారసపూరితుడగు శ్రీ ॥బా॥

చ॥ వేల్పుల సంతతి రక్షణకోయన
వేలాయుధమును ధరియించి
చెలువుగ జాతి వైరము మరచి
శేష మయూరములు చెంత తిరుగగా

తాలిమి మాలిమి గల దైవంబని
తద్దయు జనులు కీర్తన సేయగ
పళని క్షేత్రమున నెలకొనియున్న
పార్వతి తనయుని పద్మార్చితుని ॥బాల॥

ఆలమందలను తోలుకొని వెళ్ళే కృష్ణుని వర్ణించే కీర్తనను ఆభోగిరాగం, మిశ్రచాపుతాళంలో రచించారు. ఈ కీర్తనలో కృష్ణుని ఎంతో మనోహరంగా వర్ణించారు. కృష్ణుని తన మనో నేత్రంతో దర్శించి ఈ కీర్తనను రచించారేమో అని తోస్తుంది. ఈ కీర్తనను గమనించండి.

ప॥ ఆలమందల దోలుకొనుచు
అన్నతనకు తోడురాగ
అడవి భూముల కరుగు
మాధవ అందచందములరయరే ॥ఆల॥

అ॥ మేలు నిడు పులిగోరు పతకపు
గొలుసు మెడలో మెరయుచుండగ
కాలిగజ్జెల ధ్వనులు గోవుల
గంటమ్రోతల శృతులు గలుపగ ॥ఆల॥

చ॥ పాలు పెరుగు చల్ది బువ్వల
చిక్కములగొని గొల్లపిల్లలు
పందెములతో ముందు నడువగ
భాను తేజము మోము పైబడ
పట్టుజరి పీతాంబరముతో
పసిడినేత్రదండముతో
పద్మవికసిత నయనములతో
బాలుడై మరి గోపాలుడై ॥ఆల॥

శహనరాగం ఆదితాళంలోని 'దీనరక్షకుడను బిరుదెటుగల్గెను!' అనే కృతిని గమనిస్తే త్యాగరాజస్వామి ప్రభావం మనకు కనిపిస్తుంది. అలాగే ఈ కృతిలో రామాయణంలోని ఘట్టాలు కూడా మనకు గోచరిస్తాయి.

**శహనరాగం – ఆదితాళం**

ప॥ దీన రక్షకుడను బిరుదెటు గల్గెను
దినకరవంశ దీపక రామా ॥దీ॥

అ॥ వన్యఫలముల నేరిచి ఇచ్చిన
శబరికి మోక్షములొసగినందుకా ॥దీ॥

చ॥ కుశలముగా మిము గంగ దాటించిన
గుహుని పునీతుని జేసినందుకా
కులసతి సొమ్ముల నిచ్చిన పక్షిపై
కూరిమి జూపినందుకా పద్మానుత ॥దీ॥

'రామా? దీనరక్షకుడని మీకు బిరుదు ఎలా వచ్చిందని అడుగుతూ, శబరికి మోక్షమిచ్చినందుకా లేక గుహుని పావనుని చేసినందుకా అని ఆ రామునే అడుగుతున్నారు. – జటాయువు సీత నగలను రామునకు ఇచ్చిందని ఈ కీర్తనలో అన్నారు. అయితే సీత నగలు జటాయివు ఇచ్చినట్లు వాల్మీకి రామాయణంలో కనిపించదు. త్యాగరాజస్వామి కీర్తనలలో కూడా వాల్మీకి రామాయణంలో లేని ఎన్నెన్నో ఘట్టాలు కనిపిస్తాయి.

శుద్ధ సీమంతిని రాగం త్రిపుట తాళకీర్తన 'నందగోపకుల వరదా' లో భాగవతంలోని ఘట్టాలు కనిపిస్తాయి.

చ॥ కుబ్జాలేపన భూషణ కువలయ పీడాగజమర్ధన

సావేరి రాగం ఆదితాళంలో 'అంతులేని మోహాంబుధిలోబడి అలమట జెందకు మనసా' కీర్తన మానసికబోధ. చింతలు లేని మనసే శివుడని, వింతగా కనిపించే ఈ జగమంతా ఆయన లీల అని, మనలోగల పరమాత్ముని అన్నింటా చూసి తరించమని, తామరాకుపైన నీటి బొట్టువలె ఉండి, పూర్ణత్వాన్ని పొందమని తన మనసుకు తానే బోధ చేసుకొన్నట్లుగా జనులకు బోధచేసారు.

ఈ విధంగా వీరి కీర్తనలు ఎన్నెన్నో విశేషాలతో నిండి ఎంతో ఉత్తమంగా ఉన్నాయని చెప్పవచ్చు.

ఈ 'సంగీతరత్నమాల' గ్రంథంలోని రాగ మాలికల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దీనిలో పది అద్భుతమైన రాగమాలికలు ఉన్నాయి. మొదటి రాగమాలిక పార్వతీ కల్యాణం. ఇది అఠాణా, ఆరభి, కుంతల వరాళి; నాయకి; కల్యాణి, భైరవి, శంకరాభరణం, నాటకురంజి, సురటి అనే తొమ్మిది రాగాల మాలిక.

పెండ్లి బొట్టుపై పాపిట పిందెల
మెడలో పచ్చల వజ్రహారముల
జడలో పరిమళ పుష్పరాజముల
సింగారించిరి వధువును చెలులు

పార్వతీదేవిని ఏ విధంగా పెండ్లి కూతురుగా తయారు చేసారో వర్ణించారు. నాయికను వర్ణించ డానికి నాయకి రాగాన్ని ఉపయోగించారు.

కల్యాణం కోసం పార్వతి శివుని సన్నిధికి వచ్చే విధానాన్ని కల్యాణి రాగంలో రచించారు.

పారాణించిన పాదంబులపై
పసిడి అందెల ఘల్లు ఘల్లుమన
మరాళనడల ఒయ్యారముతో

అలాగే నందిగణములు, భూతగణములు, వేల్పులతో కలసి వచ్చే శివుని వర్ణించేదుకు కుంతలవరాళి ఉపయోగించారు.

సీతాకల్యాణాన్ని వర్ణంచే కీర్తన కూడా

నవరాగమాలికే. దీనిలో ఖరహరప్రియ, కాంభోజి, మలయమారుతం, సారంగ, ఆనందభైరవి, తోడి, బిలహరి, చక్రవాకం, మధ్యమావతి రాగాలను ఉపయోగించారు. జానక్యాకమలాజలిపుటేయాః శ్లోకం యొక్క భావంతో రచించిన చరణం. ఈ రాగమాలికలో కనిపిస్తోంది.

రామ కథను నవరాగమాలికగా వర్ణించారు. ఈ కీర్తనలలో రామునికి వనవాసం చేయాలనే కోరిక ఎందుకు కలిగిందని, ఆ రామునే పల్లవిలో ప్రశ్నించి వనవాసం చేయడానికి గల కారణాలను చరణాలలో ఏమైయుంటాయో రామునే అడుగుతూ కీర్తన రచించారు పద్మావతమ్మ.

జనకునానతి తలదాల్చి జగతి ధర్మమునిలుపుటకో
అనుజునిచే అయోధ్య పాలింపగ జేయుటకో

అని మొదటి చరణంలో తెలుపూ గుహని నావను ఎక్కి గంగదాటదానికా? కూరిమితో మునులను చూసి వారి కుశలం అడుగుటకా? అత్రిమహాముని ఇంట విందారగించుటకా? సీతకు అనసూయచేత స్త్రీధర్మములను జెప్పించుటకా? మారీచుని చేత బంగారు లేడి రూపాన్ని ధరింపచేయడానికా? సీతను లంకకు పంపి, రాక్షసులను అణచుటకా? శబరి ఇచ్చిన ఫలములను ఆరగించుటకోసమా? సుగ్రీవుని ఆర్తిని దీర్చి ప్రోచుటకా? హనుమచేత సీతకు అంగుళీయకాన్ని పంపడానికా? సీత శిరోరత్నాన్ని చూసి ఆనందం పొందదానికా? కపులచే వారధి గట్టించడానికా? రావణసంహారం చేసి పుష్పక విమానంపైన తిరిగి వచ్చుటకా? అంటూ చరణాలలో ఆ రాముని ప్రశ్నిస్తారు పద్మావతి. ఇందులో దర్బారు, భైరవి, పూర్వికల్యాణి, శహన, ఆరభి, ధన్యాసి, వసంత, హరికాంభోజి, సురటి రాగాలను ఉపయోగించారు.

సుబ్రహ్మణ్య స్వామి పూజను కనులకు కట్టేవిధంగా తొమ్మిది రాగాలలో వర్ణించారు.

శ్రీనివాసునిపై ఘనరాగ పంచకాన్ని రచించారు. ఇంకా శ్రీహరి అభయహస్తాన్ని వర్ణిస్తూ ఆరురాగాల మాలికను రచించారు.

ప॥ అల్లదే శ్రీహరి అభయహస్తము
ఆశ్రిత జనులకు కల్పకద్రుమము
అండాండములను బ్రహ్మాండములను
ఆటాడించే అద్భుత చిత్రము

అంటూ పల్లవిని ఆరంభించారు. ఈ హస్తము గోకులంలో గోపికల ఇంట వెన్నను ఆరగించిన హస్తమని, ముల్లోకాలను మోహింపజేసే మురళి వాయించిన హస్తమని, యశోదకు మూడులోకాలు చూపించడానికి మన్నును త్రవ్విన చేయి అని, ఆలమందలను అదలించిన హస్తమని, కుచేలుని అటుకులు తీసుకొని పెన్నిధిని ఒసగిన చేయి అని, రుక్మిణిని లాలించిన హస్తమని, సుర, భూసురాదులను రక్షించే హస్తమని, కురుక్షేత్రంలో అర్జుని రథసారథిగా యుద్ధాన్ని నడిపిన చేయి అని, తిరుపతిలో వెలసి ఆపదలను దీర్చే హస్తమని ఇలా ఎంతో హృద్యంగా వర్ణించారు.

వరలక్ష్మీ దేవి పూజ ఏ విధంగా చేయాలో వర్ణిస్తూ 'పూజింపగరారె పుణ్యాంగన లార'

అనే ఐదు రాగాల మాలికను రచించారు. ఇది శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని చేసే వారందరూ పాడుకోదగిన మంచి కీర్తన.

జగన్మాత కామాక్షి దేవి పూజ చూడరారే అనే ఏడురాగాల మాలికలో కామాక్షి పూజా విధానాన్ని ఎంతో మనోహరంగా వర్ణించారు.

'మ్రోగెనదే హరిమురళి' అంటూ హంస రాగపంచకంలో రాగ తాళమాలికగా రచించారు. దీనిలో హంసధ్వని, హంసభూషణి, హంసకాంభోజి, హంసనాదం, హంసానంది రాగాలను ఉపయోగించారు. హంసభూషణి, హంసకాంభోజి వంటి అపురూప రాగాలను ఉపయోగించడం విశేషం. పల్లవిని రూపక తాళంలోను, చరణాలను త్రిపుట, ఆది, ఏక ఝంపె తాళాలలో రచించారు.

హంసభూషిణి 24వ మేళకర్త వరుణప్రియ జన్యంకాగా, హంసకాంభోజి 14వ మేళకర్త వకుళాభరణం జన్యం. హంసనాదం రాగాన్ని 60వ మేళకర్త నీతిమతి జన్యరాగంగా షట్ శృతి దైవతంతో వీరు ఉపయోగించారు. అయితే ప్రస్తుతం హంసనాదాన్ని షట్ శృతి దైవతం లేకుండా పాడుతున్నాము. ఈ రాగమాలికలో శ్రీకృష్ణుడు మురళీగానాన్ని చేసే విధానాన్ని ఎంతో మనోహరంగా వర్ణించారు.

దశావతారాలను నుతించే రాగమాలికను పదిరాగాలలో రచించారు. తోడి, సారంగ, మోహన, కాంభోజి, కదనకుతూహలం, అఠాణా, కల్యాణి, మలహరి, బేగడ, మధ్యమావతి రాగాలలో ఈ రచన సాగింది. ఈ విధంగా ఎన్నో అద్భుతమైన రాగమాలికలను రచించారు పద్మావతి.

కోకిలధ్వని రాగం, ఆదితాళంలో ఒక తిల్లానను రచించారు. ఈ తిల్లానాను లలితగీత తిల్లానాగా పద్మావతి పేర్కొన్నారు. తిల్లానాలలో సాహిత్యం సాధారణంగా భగవంతుని నుతించేదిగా ఉంటుంది. కానీ ఈ లలిత గీత తిల్లానాలోని సాహిత్యం లలితగీతం లా ఉంటుంది. వసంతాన్ని, కోకిల ధ్వనిని వర్ణించే సాహిత్యం ఈ తిల్లానాలో మనకు కనిపిస్తుంది. కోకిల కూతను వర్ణించిన ఈ తిల్లానా కోకిల ధ్వని రాగంలో రచించడం విశేషం. ఈ తిల్లానాలోని సాహిత్యాన్ని గమనించండి.

వసంతమదే ఏతెంచెనే
వనతరువులు పుష్పించెనే
వయారికోయిల గున్నమావిపై
పంచమశృతి పలికించెనే
**కూకూకుహూ కుకుహూకూ**

ఈ కోకిలధ్వని రాగం అపురూపరాగం. వక్రరాగం. హరికాంభోజి జన్యరాగం. దీని మూర్ఛన సరిగమదనిదస / సనిదనిపమగరిస

సంగీత రత్నమాల లో మూడు వర్ణాలు ఉన్నాయి. తోడి, మోహన కల్యాణి రాగవర్ణాలు; ఇంకా కల్యాణి రాగ పంచక వర్ణం ఉన్నాయి. మేచకల్యాణి, యమునా కల్యాణి, శ్యామ కల్యాణి, వసంత కల్యాణి, హమీర్ కల్యాణి ఈ ఐదు రాగాల మాలిక ఈ వర్ణం. పల్లవి, అనుపల్లవి, ముక్తాయి

స్వరం మేచ కల్యాణి రాగంలోనూ, చరణం, మొదటి ఎత్తుగడ స్వరం యమునా కల్యాణి రాగంలోనూ, రెండవ ఎత్తుగడ స్వరం శ్యామ కల్యాణి రాగంలోను, మూడవ ఎత్తుగడ స్వరం వసంత కల్యాణిలోనూ, నాలుగవ ఎత్తుగడ స్వరం హమీర్ కల్యాణి రాగంలోనూ రచించారు. ఈ వర్ణంలోని సాహిత్యం వేంకటేశ్వరుని నుతించేదిగా ఉంది.

పద్మావతమ్మ ప్రసిద్ధరాగాలలోనే కాకుండా ఎన్నెన్నో అపురూప రాగాలలోనూ సంగీత రచనలు గావించారు. 'హంసనాద' అనే అపురూప రాగంలో 'పాలించవమ్మ పరమేశ్వరి' అనే కృతిని రచించారు. కీర్తనకు అరుదైన 'కురుఝంపె' తాళాన్ని ఉపయోగించారు. 'హంసనాద' రాగం 60 మేళకర్త నీతిమతి జన్యం. వక్రరాగం దీని మూర్ఛన సరిమపనిస/సనిదనిపమరిస. 16వ మేళకర్త చక్రవాకం జన్యరాగమైన 'వీణాధరి' అనే అపురూపరాగంలో వీణాధరి అయిన సరస్వతీ మాతపై కృతిని రచించడం ఎంతో విశేషం. వీణాధరి ఆరోహణ సరిగపదనిస అవరోహణ - సనిదపమగరిస

65వ మేళకర్త మేచ కల్యాణి రాగం జన్యమైన శ్యామకల్యాణిలో 'జాలంధరసతీ తులసి' అనే కృతి రచించారు. ఈ శ్మాయకల్యాణి రాగాన్ని కల్యాణి రాగ పంచక వర్ణంలో కూడా ఉపయోగించారు. శ్యామకల్యాణి వక్రరాగం. దీని మూర్ఛన సరిగమపనిస/సనిపదమగరిస. పద్మకాంతి, హరి ప్రియ, శివకాంభోజి, పంచమరాగం వంటి ఎన్నో అపురూప రాగాలను వీరు ఉపయోగించారు. అపురూప తాళాలైన కురుజంపెలో నాలుగు కీర్తనలు, ఖండజాతి దుష్కర తాళంలో ఒక కీర్తన పద్మావతి రచించారు.

తమ ఉత్తమమైన సంగీత రచనలతో పద్మావతమ్మ ఆధునిక వాగ్గేయకారులలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకొన్నారు. ఈమె రచించిన సంగీత రత్నమాల గ్రంథాన్ని మాత్రమే పరిశీలించి ఈ వ్యాసాన్ని వ్రాయడం జరిగింది. ఈమె రచించిన ఇతర గ్రంథాలలోని సంగీత రచనలను పరిశీలిస్తే ఒక పెద్ద గ్రంథమే వ్రాయవచ్చును. సంగీత పరిశోధకులు పద్మావతమ్మపై పరిశోధన చేయవచ్చు. వీరి సంగీత రచనలను విద్వాంసులు తమ కచేరీలలో పాడడం, వారి శిష్యులకు నేర్పడం చేయాలి. అలా చేస్తే ఈ సంగీత రచనలు ప్రచారంలోకి వస్తాయి. ఇటువంటి గొప్ప సంగీత రచనలు ప్రచారంలోనికి వస్తే సంగీత రంగంలో మన తెలుగు వారి కీర్తి మరింతగా శోభిల్లుతుంది.

**రిఫరెన్స్ :**


1) సంగీత రత్నమాల – కాకటూరి పద్మావతి

2) ఇంటర్ నెట్ లో కాకటూరి పద్మావతి గురించిన సమాచారం

3) సంగీత విదుషి శ్రీమతి నీతా చంద్రశేఖర్ తో ఇంటర్వ్యూ

4) సంగీత విదుషి శ్రీమతి శేషులతతో ఇంటర్వ్యూ.

సుధా తరంగమ్

# కృషి ఉంటే మనిషే ఋషి అవుతాడు..



- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ



కృషి ఉంటే మనిషే ఋషి అవుతాడు..

ఎన్నో అవరోధాలు దాటుకొని, కష్టపడి సంగీతం నేర్చుకొని, మంచి గాయనిగా పేరుతెచ్చుకొని, ఆదర్శంగా నిలిచారు దేవన సుభద్ర గారు. ఆవిడ పుట్టు అంధురాలు. చాలా పేద కుటుంబంలో పుట్టారు.

ఉన్న కొద్దిపాటి చూపుతో, చేతి కర్ర ఊతం కూడా లేకుండా చకచకా నడిచేస్తూ, బస్సులు ఎక్కి దిగుతూ, ఎన్నో నృత్య కార్యక్రమాలకు గాత్ర సహకారం ఇచ్చేవారు ఆవిడ. ఇప్పటిలాగా సీడీలు, సెల్ ఫోన్లు, పెన్ డ్రైవులలో నేపథ్య సంగీతం వినిపిస్తూ,నృత్యాంశాలు ప్రదర్శించటం లేదు ఆరోజులలో.

నృత్య కార్యక్రమాలలో గాత్రం, నట్టువాంగం, మృదంగం, వయొలిన్, వేణువు, వీణ, క్లారియోనెట్, ఘటం వగైరా కళాకారులంతా వేదికపై ఒకపక్క కనిపించేవారు. అలా కొన్ని వందల నృత్య కార్యక్రమాలకు దేశమంతా తిరిగి,తన గాత్రం అందించారావిడ.తన స్వల్ప సంపాదనతో కుటుంబాన్ని పోషించేవారు. సంగీతంలో

డిప్లొమాతో పాటు, తిరుపతి ఎస్వీ సంగీత కళాశాలలో ఎమ్మెస్ బాలసుబ్రహ్మణ్యం గారి శిష్యరికంలో సంగీత ప్రవీణ చేశారావిడ.

తదుపరి విజయవాడ వచ్చి, మా గురువుగారైన అన్నవరపు రామస్వామి గారి వద్ద సంగీతం కోసం చేరారు.

నాకు అప్పుడు పద్నాలుగు సంవత్సరాలు. ఆవిడ పాడుతుంటే కళ్ళప్పగించి చూసేవాణ్ణి. సన్నటి తీగెలాంటి గాత్రంతో తారస్థాయికి అలవోకగా వెళ్లి పాడేవారు. కొత్త పాఠం ఒక్కసారి వినగానే పాడేసే అతి సూక్ష్మగ్రాహి.

గురువుగారి ఇంట్లో హాలులో ఆమూల నుండి ఈమూల వరకు డజను మంది శిష్యులం వరుసగా కూర్చొనేవాళ్ళం. అందులో అందరిలోకీ చిన్నవాణ్ణి నేనే. మాచేత విడివిడిగా స్వరకల్పన వేయించేవారు. ప్రతిసారీ సుభద్రగారి స్వరకల్పనే తలమానికంగా ఉండేది. ఆవిడను ఎంతో అభినందిస్తూ ఉండేవారు గురువుగారు. గలగలా మాట్లాడుతూ, అందరినీ నవ్విస్తూ హుషారుగా ఉండే ఆవిడ, ఎప్పుడూ నమ్రతతో, మౌనంగా ఉండే నన్ను సరదాగా "బుద్ధవతారా!" అంటూ ఆటపట్టించేవారు.

పాఠం అవగానే గురువుగారు NOTATION వ్రాయమనేవారు. సుభద్రగారు సంచీ లోనుండి డ్రాయింగ్ బుక్ ఒకటి తీసేవారు. దాని నిండా పిల్లలు వేసిన బొమ్మలేవో ఉండేవి.

ఆవిడ మాంటిస్సోరీ స్కూల్ లో MUSIC TEACHER గా ఉద్యోగం చేయటంచేత, పిల్లలు వాడిపారేసిన దళసరి కాగితాల డ్రాయింగ్ బుక్స్ తెచ్చుకొని, వాటిపై "బ్రెయిలీ లిపి"లో సంగీతం NOTATION ఎంత వేగంగా వ్రాసేవారంటే, షార్ట్ హాండ్ వారు కూడా ఆ వేగం ముందు తీసికట్టే. అంతే కాదు. తను వ్రాస్తూనే మిగిలిన విద్యార్థులకు స్వరం, దాని క్రింద వచ్చే సాహిత్యం, దీర్ఘాలు, అండర్ లైనులు, ఆవర్తం గుర్తులతో సహా NOTATION వ్రాయటం అరటిపండు వలిచి, నోటికి అందించినట్లు చెప్పేవారు.

ఆవిడ ఏకాగ్రత ఎలాంటిదంటే.. ఒక చేత్తో ఆది తాళం, మరోచేత్తో రూపక తాళం వేస్తూ రాగం తానం పల్లవిని చిన్నతనంలోనే (1975 లో) అద్భుతంగా నిర్వహించటం నేనెరుగుదును. అతి వేగంతో సర్వలఘు స్వరకల్పన చేస్తూ షడ్జం నుండి ఒక్కొక్క స్వరం దాటుతూ సరి సగ సమ సప సద సని సస.. అంటూ గుక్కతిప్పుకోకుండా పాడటం ఆవిడ దగ్గరే మొట్టమొదట విన్నాను.

ఆకాశవాణిలో లలిత సంగీతంలో ఏ గ్రేడ్ పొంది, ఎన్నో భావగీతాలు, భక్తిగీతాలు పాడారు."వచ్చింది పువ్వంటి నవ్వు.. రాలేదు నా దరికి నువ్వు" అనే పాట శ్రీ ఎన్ సివి. జగన్నాథాచార్యులు గారితో యుగళ గీతంగా పాడారావిడ. ఆపాట ఆరోజుల్లో ఎంతో ప్రసిద్ధం. ఎలాంటి క్లిష్టమైన సంగతి అయినా ఆవిడ గళంలో తేలికగా వినిపించేది.

విజయవాడ ప్రభుత్వ సంగీత కళాశాలలో గాత్ర అధ్యాపకురాలుగా చాలాకాలం పనిచేసి, ఎందరో విద్యార్థులకు చక్కని శిక్షణ ఇచ్చారావిడ.

ఎంతో ప్రతిభ ఉన్నా, ఆకాశవాణి ఆడిషన్ బోర్డు వారు శాస్త్రీయ సంగీతంలో ఆవిడను ఎంపికచేయలేదు. అందుకు ఏమీ బాధ పడకుండా, "గాయనిగా నాకున్న పేరు నాకుంది. దీనివల్ల పోయేదేమీ లేదు" అనేవారావిడ!

నేను రేడియోలో సంగీత నిర్దేశకుడిగా పనిచేసేటప్పుడు దేశభక్తి గీతాలు పాడేందుకు ఒకసారి ఆవిడకు కాంట్రాక్ట్ పంపాను. అయితే, ఎంతో సీనియర్ అయిన ఆవిడను బృందగానంలో పాడమనటానికి నేను సంశయిస్తుంటే, "నాకేం అభ్యంతరం లేదు. మీ అవసరానికి తగినట్లు గాత్రం ఇవ్వటం నా బాధ్యత. అది బృందగానం అయితేనేం? సోలో అయితేనేం?" అంటూ మిశ్ర కీరవాణి రాగంలో నేను స్వరపరచిన "అందాలు చిందేటి అవని భారతి తల్లి" అనే పాట బృందంతో పాడారు." ఎంత బాగా చేశావయ్యా పాట!" అంటూ నన్ను మెచ్చుకున్నారు.

ఆ ముందురోజు ఎక్కడో కార్యక్రమంలో పాల్గొని, ప్రయాణంతో అలసిపోయి ఉండటంతో పాడటానికి ఆరోజు కొంత ఇబ్బంది పడ్డారు ఆవిడ.

ఇది జరిగిన కొద్ది రోజులకే (2003లో ) సుభద్రగారు ఇకలేరనే వార్త విని, ఆ నిజాన్ని జీర్ణించుకోలేకపోయాను. ఎప్పటికీ విజయవాడ ఆకాశవాణిలో ఆవిడ గానంచేసిన గీతాలు ప్రసారం అవుతూనే ఉంటాయి. ఆవిడ దత్త పుత్రుడైన మృదంగ విద్వాన్ బీరక సురేష్ బాబుగారు, ఆవిడ సంస్మరణార్థం సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండటం ఎంతైనా అభినందనీయం!

# కృతి "సాధించెనే" గురించి ఒక చిన్న వివరణ

ఇది సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి ప్రసిద్ధ 'ఘన రాగ పంచరత్న కృతులలో' ఒకటి.

ఈ కృతిని, తెలుగు మరియు సంస్కృత భాషలలో గొప్ప పండితులైన దివంగత శ్రీ ఎన్. సిహెచ్. కృష్ణమాచార్యుల వారు స్వయంగా, ఎంతో వివరంగా మరియు నమ్మశక్యమైన వివరణలతో విశ్లేషించారు. ఈ వ్యాసం 80వ దశకం ప్రారంభంలో (నాకు సరిగ్గా గుర్తుంటే), కాకినాడ నుండి సంగీతానికి అంకితమై వెలువడే 'గానకళ' అనే మాసపత్రికలో ప్రచురితమైంది; ఆ సమయంలో నేను ఆ పత్రికను చదివే అవకాశం పొందాను.

ఆయన ఇచ్చిన వివరణ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది మరియు నాకు పూర్తి నమ్మకాన్ని కలిగించింది. గత తరం కర్ణాటక సంగీత దిగ్గజం దివంగత శ్రీ డొక్క శ్రీరామమూర్తి గారు కూడా ఈ వివరణను సమర్థించారు.

వెంటనే నేను ఆ పత్రిక సంపాదకులకు ఒక లేఖ రాస్తూ, చెన్నైలోని 'శ్రీ కృష్ణ గాన సభ'లో జరిగే గోకులాష్టమి సంగీత ఉత్సవాల సందర్భంగా నా కచేరీలో, ఆయన వివరణకు అనుగుణంగానే ఈ కృతిని ఆలపిస్తానని తెలియజేశాను. ఆ వివరణ ప్రకారం, ఎటువంటి సంకోచం లేకుండా, ఎంతో ధైర్యంతో ఈ కృతిని మొట్టమొదటిసారిగా ఆలపించిన వ్యక్తిని నేనే.

సహజంగానే, అలా పాడటం విన్న ప్రేక్షకుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది; కానీ భాషా పరిజ్ఞానం నా బలం కాబట్టి, నేను ఆ వ్యతిరేకతను పట్టించుకోలేదు.

అప్పటి నుండి, నేను ఎక్కడ, ఎప్పుడు కచేరీ చేసినా, ఈ కృతిని అదే పద్ధతిలో ఆలపిస్తూ వస్తున్నాను.

ఈ మధ్యకాలంలో, ఈ కృతిలోని అంతరార్థాన్ని మరియు భావాన్ని లోతుగా గ్రహించి అర్థం చేసుకున్న తర్వాత, చాలా మంది సంగీతకారులు ఇప్పుడు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు.

అయితే, ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో జరిగే 'పంచరత్న గోష్ఠి గానాలలో' (సమూహ గానాలలో) మాత్రం, 'సంప్రదాయం' అనే ముద్రతో, ఈ పద్ధతిలో మార్పు రాకపోవడం మరియు దీనిని అనుసరించకపోవడం చాలా విచారకరం.

కనీసం రాబోయే తరం వారైనా ఈ ధోరణిని మారుస్తారని ఆశిద్దాం.

సంగీతాన్ని మరియు సంగీత లోకాన్ని ఆ దైవం కాపాడుగాక!

"సంగీత జ్ఞానము, భక్తి వినా సన్మార్గము గలదే ఓ మనసా?"

**– తాడేపల్లి లోకనాథ శర్మ**

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## సామ ఫౌండేషన్: బెంగుళూరు ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

శ్రీనివాస్ దావులూరి

స్థానిక "BEL కళాక్షేత్ర ఆడిటోరియం"లో సామ ఫౌండేషన్, బెంగుళూరు వారు తమ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మార్చినెల 14-15 తేదీలలో రెండురోజుల కర్ణాటక సంగీత కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు.

14వ తేదీ కార్యక్రమాలు యువకళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో "బాలకళా ఉత్సవం" లో, వీనులవిందైన వీణావాదనంతో ఆరంభమయ్యాయి. ముఖ్య కార్యక్రమంగా విద్వాన్ R. రాహుల్ గారి వాయులీన వాద్యసభను ఏర్పాటు చేయడం జరిగింది. వాయులీనంపై కుమారి శ్రీవిద్య దావులూరి దీటైన సహకారం అందించగా, విద్వాన్ H.S.సుధీంద్ర మృదంగంపైనా, విద్వాన్ ఓంకార్ ఘటంపైనా సహకారమందించి లయ విభాగాన్ని మనోహరంగా పోషించారు. శ్రీ జగన్నాథ్ శ్రుతి సహకారం అందించిన ఈ సభ భైరవి అటతాళ వర్ణంతో ఆరంభమై హాలులో చక్కనైన సంగీత వాతావరణం కల్పించగా, తరువాత వినిపించిన "మాయమ్మ అని నే", "సుబ్రహ్మణ్యాయ నమస్తే" అంశాలు రసజ్ఞులను ఆనందింపజేసాయి. ఖండనడలో సాగిన పల్లవి అనంతరం మధువంతిరాగ తిల్లానాతో ముగిసిన సభ ఆసాంతం వాగ్గేయకార రచనలలో సౌందర్యాన్నీ, సంగీతంలో గల ఔన్నత్యాన్ని చాటిచెప్పే విధంగా సాగింది. కుమారి శ్రీవిద్య వాయులీన సహకారం ఆద్యంతం రక్తి కట్టించింది. విద్వాన్ H.S.సుధీంద్ర, విద్వన్ ఓంకార్ గారల లయవిన్యాసమూ, వారి సహకార నైపుణ్యమూ సభకు వన్నె చేకూర్చాయి.

15వ తేదీ సాయంత్రం మొదటగా జరిగిన విద్వాన్ మాధురి కౌశిక్ గాత్రసంగీతసభ రసవత్తరంగా సాగింది. వాయులీనంపై విద్వాన్ C.V.శ్రుతి, మృదంగంపై ఆదమ్య రామానంద్, మోర్సింగ్ పై శ్రీ కార్తిక్ ప్రణవ్ సహకరించగా గాయని సంస్థ నామం వినిపించేలా సామరాగంలో అంశం వినిపించడం విశేషం.



విద్వాన్ రాగుల్ రవిచంద్రన్ వయోలిన్ కచేరీ




విద్వాన్ మాధురి కౌశిక్ మరియు బృందం గాత్ర కచేరీ




**సోమశేఖర్ జోయిస్ మరియు బృందం కొన్నకోల్ మరియు గాత్ర సంగీత సమితి**

తరువాత జరిగిన "ప్రత్యేక వాద్యగోష్ఠి" కార్యక్రమాన్ని విద్వాన్ సోమశేఖర్ జోయిస్ తమ కొనక్కోలు శబ్దప్రదర్శనంతో ప్రత్యేకత సంతరించుకునేలాగ నిర్వహించి ప్రేక్షకుల మెప్పు పొందారు. ఈ కార్యక్రమంలో గానంతో విద్వాన్ M.K.తేజస్విని, వాయులీనంపై విద్వాన్ శ్రీవిద్య దావులూరి, మురళి పై విద్వాన్ రఘుసింహ, మృదంగంపై విద్వాన్ అనూర్ వినోద్ శ్యామ్, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం "సరస్వతి నమోస్తుతే" అంటూ ఆరంభమై షణ్ముఖప్రియ రాగంలో పల్లవితో అలరించి, ధనశ్రీ రాగ తిల్లాన తో ముగిసింది. కార్యక్రమం ఆరంభంనుండి ఉన్నతమైన స్థాయిలో రసజ్ఞులకు మంచి అనుభవాన్ని అందించే రీతిలో మన కళాకారులు కలిసికట్టుగా మన సంగీత సంప్రదాయాన్ని ఎలా ముందుకు తీసుకొని పోగలరో తెలియజేసింది.

ఈ వేడుకలకు మొదటిరోజు డైరక్టర్ బెల్ కాంప్లెక్స్, బెంగళూరు, శ్రీ రజనీశ్ శర్మ శుభారంభం చేయగా, రెండవరోజు మ్యూజికాలజిస్ట్ శ్రీమతి T.S.సత్యవతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామ ఫౌండేషన్ ట్రస్టీలు డా.M.V.R.సుజాత, మరియు శ్రీనివాస్ దావులూరి కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించడమే కాక రెండురోజులూ అందరికీ పసందైన విందును కూడా అందించి అందరి మన్ననలనందుకున్నారు.

## సరస్వతీ గానసభ, కాకినాడ

సరస్వతీ గానసభ 122వ సంగీత, నృత్య నాటకోత్సవాలలో మూడవ విడత, మూడు రోజుల కార్యక్రమాలలో భాగంగా... మొదటిరోజున అనగా ది. 27-03-2026, శుక్రవారంనాడు మైసూరు బ్రదర్స్ శ్రీయుతులు మైసూర్ నాగరాజ్,మైసూర్ మంజునాథ్ ల వయోలిన్ యుగళ సంగీత కచేరీ సమ్మోహనంగా జరిగింది.

వారికి మృదంగంపై శ్రీ నైవేలి వెంకటేష్, ఘటంపై శ్రీ ఎస్. కార్తీక్ గారలు సమ ఉజ్జీలుగా సహకరించారు.

తొలుత సభాధ్యక్షులు డా.ముళ్ళపూడి నాగేశ్వరరావుగారు స్వాగత వచనాలు పలికారు.

కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ కళాకారులను సభకు పరిచయం చేశారు.

122 సంవత్సరాలుగా నిరంతరాయంగా సంగీత సేవ చేస్తూ వస్తున్న, దేశంలోనే అతి పురాతనమైన సరస్వతీగానసభ వంటి ప్రతిష్టాత్మకమైన సంగీతసభలో తాము కచేరీ చేయడం ఎంతో అదృష్టమని మైసూర్ సోదరులు పేర్కొంటూ, కాకినాడలోని శ్రోతలు ఎంతో నాణ్యతా ప్రమాణాలు కలవారని వారు కొనియాడారు.




శ్రీ రాగంలోని త్యాగరాజస్వామి వారి ఎందరో మహానుభావులు... కీర్తనతో వారి కచేరీ ప్రారంభించారు.

తరువాత జగన్మోహిని రాగంలో 'శోభిల్లు సప్తస్వర' అనే కీర్తన వినిపించారు.

ఆ తర్వాత హిందోళ రాగంలోని "సామజవర గమన" కీర్తనతో వారు మరో లోకపు ద్వారాలు తెరిచారు.

వారి వాదనలో ప్రతి స్వరం శ్రోతల హృదయాలను తాకుతూ వారిని రసానందడోలికల్లో తేల్చింది.

ఈ కీర్తన పూర్తి అయ్యాకా శ్రోతలు నిలబడి చేసిన హర్షధ్వానాలే (STANDING OVATION) ఇందుకు నిదర్శనం!

తరువాత సామ రాగంలో "మానస సంచరరే" అనే కీర్తన వాయించి, మెయిన్ ఐటెంగా కల్యాణి రాగంలో రాగం తానం పల్లవి చేసి శ్రోతలకు మహత్తర అనుభూతిని అందించారు.

అప్పటికప్పుడు వారు కూర్చిన "శ్యామలం కోమలం రఘురామం.. సదా భజామ్యహం" అనే పల్లవి శ్రీరామ నవమి రోజున సందర్భవంతంగా ఉంది.

వారి వయొలిన్ వాదనలో సరళత్వం ఉంది. సంక్లిష్టతా ఉంది.అలాగే సాంకేతికతా ఉంది, భావాత్మకతా ఉంది. సోదరులిద్దరూ తమ ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తూ, ఏకత్వాన్ని కాపాడేరు.

చివరిగా అహీర్ భైరవ్ రాగంలో 'పిబరే రామరసం' వాయించి, తిల్లానాతో కచేరీ ముగించారు.

తనియావర్తనం అంశంలో శ్రీ నైవేలీ వెంకటేష్ మృదంగం పైనా, శ్రీ ఎస్. కార్తీక్ ఘటంతోనూ చేసిన మాయాజాలం సభాసదులను మంత్రముగ్ధులను చేసింది.

ఈ సభలో సరస్వతీ గానసభ కార్యవర్గ సభ్యులు, ఎందరో సంగీత రసజ్ఞులు పాల్గొని విజయవంతం చేశారు.

రెండవరోజు కార్యక్రమంలో




సంగీతం రాగసుధకు కేవలం విద్య కాదు, అది.. ఆమె జీవ ధాతువు!

పూర్వీకల్యాణి రాగంలో 'నిను వినా దిక్కెవ్వరున్నారు' అనే శ్యామాశాస్త్రివారి కృతిలో, "కామితార్థ ఫలదాయిని" అంటూ, అలాగే కచేరీలో ముఖ్యాంశంగా చేసిన ఖరహరప్రియ రాగంలో ఆలపించిన 'రామ నీ సమాన మెవరూ?' కృతిలో 'పలుకు పలుకులకు' అంటూను నెరవలి విభాగంలో ఆమె ప్రదర్శించిన సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది.

ఇక స్వరకల్పనలో ఆమె చూపించిన నైపుణ్యం,

లయపై ఆమెకున్న పట్టు, స్వరాల మధ్య ఆమె చేసిన సంచారం..సంగీతం పట్ల తనకున్న నిబద్ధత, నిరంతర సాధనలను తెలియచేస్తున్నాయి.

సరస్వతీ గానసభ 122వ సంగీత, నృత్య నాటకోత్సవాలలో మూడవ విడత, మూడు రోజుల కార్యక్రమాలలో భాగంగా...రెండవ రోజున అనగా ది. 28-03-2026, శనివారంనాడు జరిగిన కుమారి రాగసుధా బాలసుబ్రమణియన్, చెన్నై గాత్రసంగీత కచేరీ గురించి పైన చెప్పిన మాటలు.

ఆద్యంతం శ్రోతలు మైమరచిపోయేలా గాత్ర సంగీత కచేరీ చేసిన ఈ యువగాయని భవిష్యత్తులో ఉత్తమ గాయనిగా పేరు ప్రఖ్యాతులు పొందగలదనడంలో సందేహం లేదు.

'ఏరా నాపై ఇంత చౌక' అనే తోడి రాగంలోని పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ వర్ణంతో ప్రారంభించి, ఆందోళిక రాగంలో 'రాగ సుధారస పానముచేసి' అనే త్యాగరాజుల వారి కృతితో ఆమె శ్రోతలను తన కచేరీలోకి తీసుకెళ్ళిపోయారు.

'ఏమయ్య రామ... బ్రహ్మేంద్రాదులకునైన' అనే రామదాసు కీర్తన కాంభోజి రాగంలోనూ, తిరుపతి నారాయణస్వామివారు బేహాగ్ రాగంలో కూర్చిన 'వగలాడి మాటలకు' అనే జావళీని రాగసుధ ఆలపించిన తీరు ఔరా అనిపించింది.

చివరగా మధువంతి రాగంలో మల్లాది సూరిబాబుగారు స్వరపరచిన 'ఉదయాద్రిపై దివ్వె' అనే లలిత గీతాన్ని, మణిరంగు రాగంలో 'మామవ పట్టాభిరామ' అనే దీక్షితర్ వారి కృతిని భావస్ఫోరకంగా ఆలపించి, కచేరీని రస హృదయులైన శ్రోతల హర్షధ్వానాల మధ్య మంగళప్రదంగా ముగించారు.

ఈ సభలో సరస్వతీ గానసభ కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో రసజ్ఞులైన శ్రోతలు పాల్గొని విజయవంతం చేశారు.

ఒక సంగీత జీవితం పొందిన మహోన్నత గౌరవం 'స్వర సరస్వతి' శ్రీమతి పెద్దాడ సూర్యకుమారిగారికి సమర్పించిన జీవిత సాఫల్య పురస్కారం.

ఇన్నేళ్లుగా శాస్త్రీయ సంగీతానికి అంకితమై, ఎందరో శిష్యులకు గురువుగా మారిన ఆ విదుషీమణికి ఈ గౌరవం కచ్చితంగా తగినదే! ఎందుకంటే ఈ సన్మానం కర్ణాటక శాస్త్రీయ సంగీత పారంపర్యానికి జరిపిన గౌరవం!





సరస్వతీ గానసభ 122వ సంగీత, నృత్య నాటకోత్సవాలలో మూడవ విడత, మూడు రోజుల కార్యక్రమాలలో భాగంగా... చివరి రోజున అనగా ది. 29-03-2026, ఆదివారంనాడు ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత కళాకారిణి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారిగారికి జీవిత సాఫల్య పురస్కారం అందచేయడంతో పాటు ' స్వర సరస్వతి' బిరుదు ప్రదానం చేయబడింది.

సరస్వతీగానసభ కార్యవర్గ సభ్యులందరూ... శ్రీమతి సూర్యకుమారిగారిని సన్నాయి మేళం మంగళవాయిద్యాలతో, వేద పండితుల ఆశీర్వచన మంత్రాలతో సగౌరవంగా వేదికపైకి తోడ్కొని వచ్చారు. మాజీ మంత్రివర్యులు, లోకసభ మాజీ సభ్యులు అయిన శ్రీ మల్లిపూడి మంగపతి పల్లంరాజుగారితో పాటు, గానసభ జీవితకాలపు ఛైర్మన్ శ్రీ కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింగరావు, సభాధ్యక్షులు డా. ముళ్లపూడి నాగేశ్వరరావు, ఉపాధ్యకులు శ్రీ లక్కరాజు సత్యనారాయణ్ (టిక్కు), కార్యదర్శి శ్రీ పేపకాయల రామకృష్ణ గార్లతో పాటు, పెద్దలు శ్రీ కె.వి. వి.బి.శర్మ, శ్రీ ఎ.సీతాపతిరావు గార్ల మార్గదర్శకత్వంలో మిగిలిన కార్యవర్గ సభ్యులు అందరూ కలిసి శ్రీమతి సూర్యకుమారిగారిని ఘనంగా సత్కరించారు. ఆమెకు ప్రశంసా పత్రము (CITATION), సన్మాన పత్రము, నగదు బహుమతి అందచేశారు.

వేదాశీర్వచనాలు, వేనోళ్ళ పొగడ్తలు, పుష్పాభిషేకాలు, పూలహారాలు, పాదాభివందనాలు, శాలువాలు.. ఇవన్నీ కేవలం ఆచారాలు కాదు.. ఇన్నేళ్లుగా సంగీతానికి ఆమె చేసిన సేవకు సమాజం సమర్పించిన కృతజ్ఞతాంజలి!

ఏదో ఆనవాయితీగా జరిపే ఒక సాధారణ సన్మానం కాదు..., హృదయపు లోతులనుంచి, ఆత్మీయ స్పర్శతో, పూజ్య భావంతో ,కృతజ్ఞతా పూర్వకమైన భక్తి శ్రద్ధలతో ఆమె సన్నిహితులు, సంగీత ప్రియులు, శ్రీరామ సమాజం, సంగీత విద్వత్సభ, సత్కళావాహిని, సంగీత స్రవంతి, శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య వంటి తోటి సంగీత సంస్థలు, శిష్యులు, శ్రీమతి లక్కరాజు శేషకుమారి మెమోరియల్ సంగీత పాఠశాల విద్యార్థులు,ఇతర కళాకారులు సమర్పించుకున్న పుష్పార్చనలు.

ఆస్తులను సంపాదించుకున్న వారికంటే, అప్తులను సంపాదించుకన్నవారే గొప్పవారు.. అన్న మాటలకు నిలువెత్తు నిదర్శనం... శ్రీమతి పెద్దాడ సూర్యకుమారిగారికి జరిగిన సన్మానం!

తనకు జరిగిన ఈ సన్మానానికి ఉచిత రీతిలో స్పందిస్తూ, కృతజ్ఞతలు తెలిపారు శ్రీమతి సూర్యకుమారిగారు. తనకు జరిగిన సన్మానం తన ఈ శరీరానికి కాదనీ, సంగీత సరస్వతికే అని ఎంతో వినయపూర్వకంగా వచించారు.

సన్మాన కార్యక్రమం పూర్తి అయిన తరువాత శ్రీమతి పెద్దాడ సూర్యకుమారిగారి శిష్యులు సంగీత కచేరీ చేశారు. వారిలో, శ్రీ ప్రవీణ్, శ్రీమతి కేశిరాజు శారద, శ్రీ పేపకాయల రామకృష్ణ, శ్రీమతి చావలి సూర్యకుమారి మొదలైన వారున్నారు. వారికి శ్రీయుతులు ఉపద్రష్ట హరిప్రసాద్ వయొలిన్ పైనా, మహదాసు ఏడుకొండలు మృదంగం పైనా, సరస్వతుల హనుమంతరావు ఘటం పైనా సహకరించారు.

**సి.యస్.**

# శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ, వరంగల్






15.3.26న శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ, వరంగల్ లో ఆక్స్ ఫర్డ్ హైస్కూల్ వేదికగా శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి జయంతోత్సవము ఆనందదాయకంగా జరిగింది మొదటగా ప్రొఫెసర్ వెనుకపల్లి తిరుపతయ్య గారు తదుపరి శ్రీమతి కృష్ణవేణి గారు, శంకరాదిత్య గారు, భీమశంకర్ గారి కచేరీలు సభికులు మన్ననలు పొందాయి.

# "సంగీత శాస్త్ర బోధిని" సంగీత గ్రంధం ఆవిష్కరణ సభ




"సంగీత శాస్త్ర బోధిని" సంగీత గ్రంధం ఆవిష్కరణ సభ 16. 04. 2026 సాయంత్రం మన్సూరాబాద్ జడ్జెస్ కాలనీ ఎస్. ఎస్. సంగీత అకాడమీ ఆధ్వర్యం లో జరిగింది . ఈ గ్రంథ ముద్రణకి సహకరించిన ప్రముఖ సంగీత సాహిత్య పోషకులు శ్రీ రవికృష్ణ అన్నదానం, డా. వరలక్ష్మి అన్నదానం (అమెరికా న్యూజెర్సీ వాసులు) ఇతర సంగీతప్రియులు, గ్రంథ రచయిత సంగీతవిద్వాంసులు గరికిపాటి వెంకట ప్రభాకర్,గరికిపాటి పద్మలలిత ఆవిష్కరణ లో పాల్గొన్నారు .ఇది సంగీతోపాధ్యాయులకు, సంగీత విద్యార్థులకు ఎంతో ఉపయోగమని పలువురు శ్రీ ప్రభాకర్ ని ప్రశంసించారు.

# లాలిత్యం - విదుషి భాస్కర లలిత గారికి సంగీత నీరాజనం






హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్ లో సోమవారం 23 మార్చ్ 2026 న 'లాలిత్యం' అను శీర్షికన 'హైదరాబాద్ సోదరీమణుల'లో ఒకరైన 'సంగీత చూడామణి', 'సప్తగిరి సంగీత విద్వన్మణి' కుమారి భాస్కర లలిత గారికి సంగీత నీరాజనం అత్యంత హృద్యంగా జరిగినది. నేడు "లాలిత్యం" ఐదవ వార్షికోత్సవం. గత సంవత్సరం నుండి హైదరాబాద్ సోదరీమణుల శిష్యులచే " లాలిత్యం – ఛాంబర్ కాన్సర్ట్స్" నిర్వహించబడుతున్నవి. నేటి కచేరీలో ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ అయ్యగారి శ్యామసుందర్ గారు శ్రీమతి జయలక్ష్మి గారు, శ్రీ ఎస్.కె. వెంకటాచారి గారు, శ్రీమతి సుందరీ జానకిరామన్ గారు, శ్రీమతి ఉమాదేవి గారు, శ్రీమతి మరియు శ్రీ జె. రాంబాబు ఐ.ఏ.ఎస్. గార్లు, శ్రీ డి.వి. మోహనకృష్ణ గారు, విజ్ఞాన్ సమితి శ్రీ సుజ్ఞాన్ గారు, స్థానిక ప్రముఖ సంగీత సభల కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు, హైదరాబాద్ సోదరీమణుల కుటుంబం, వారి శిష్యబృందం మరియు తదితరులు పాల్గొన్నారు.

'లాలిత్యం' కార్యక్రమాన్ని 'సంగీత చూడామణి', 'సప్తగిరి సంగీత విద్వన్మణి' విదుషీ శ్రీమతి భాస్కర హరిప్రియ గారు, శ్రీ దరూర్ రాఘవాచారి గారు మరియు కళాకారులు శ్రీ కె.ఎస్. విష్ణుదేవ్ గారు, కు॥ వి.ఎస్.పి. గాయత్రీ శివాని, శ్రీ కె. సద్గురు చరణ్ గారు, శ్రీ ఎమ్. చంద్రకాంత్ గారు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా, వారి కుటుంబ సభ్యులలో ఒకరైన చి॥ సి.హెచ్. శ్రీరామ్, తమ పెద్దమ్మ గారైన లలిత గారి గురించి మాట్లాడారు.

తదుపరి శ్రీ కె.ఎస్. విష్ణుదేవ్ గారి గాత్ర కచ్చేరి ప్రారంభమైనది. వారికి వయోలిన్ పై కుమారి వి.ఎస్.పి. గాయత్రి శివాని, మృదంగం పై శ్రీ కె. సద్గురు చరణ్ గారు, ఘటం పై శ్రీ ఎమ్. చంద్రకాంత్ గారు అత్యద్భుతంగా సహకరించారు. వారు ప్రప్రథమంగా

భైరవి రాగంలోని త్యాగరాజ స్వామి వారి కృతి లలితే శ్రీ ప్రవృద్ధే తో వీనులవిందు చేశారు. తదుపరి లలిత రాగంలోని ఆలాపనతో రంజింప చేసి, రూపక తాళం లోని ముత్తుస్వామి దీక్షితార్ కృతి హిరణ్మయీం లక్ష్మీం సదా భజామి ని అత్యంత హృద్యంగా గానం చేసి రసపూర్ణమైన నెరవు, స్వరకల్పనలతో ప్రేక్షకులని సమ్మోహనపరిచారు. తదుపరి నీలాంబరి రాగం లో బ్రోవవమ్మ బంగారుబొమ్మ అను శ్యామశాస్త్రి కృతి ని ఎంతో ఆర్ద్రంగా గానం చేశారు. పిమ్మట కన్నడగౌళ ఆలాపన చేసి ఓరజూపుజూచెది న్యాయమా అను త్యాగరాజ కృతిని గానం చేశారు.

ప్రధానాంశంగా వాచస్పతి రాగం లో అమోఘంగా ఆలాపన చేసి తిరువనంతపురం నవరాత్రి కృతులలో ప్రముఖమైన స్వాతి తిరునాళ్ వారి కృతి "పాహి జగజ్జనని"ని రసరమ్యంగా గానం చేసి కచేరీని రక్తికట్టించారు. వయోలిన్ పై శివాని ఎంతో చక్కగా సహకరించింది. జతిభేదంతో కూడిన అత్యద్భుతమైన తన్యావర్తనం తో శ్రీ కె. సద్గురుచరణ్ గారు మృదంగం పై, శ్రీ ఎమ్. చంద్రకాంత్ గారు ఘటం పై కచేరీని పతాక స్థాయికి చేర్చి ప్రేక్షకులను తన్మయులని చేశారు.

తదుపరి అలివేణి ఎందుచెయ్యు అను స్వాతి తిరునాళ్ వారి మలయాళ పదాన్ని కురంజి రాగంలో భావయుక్తంగా గానం చేసి, దుర్గ రాగంలో మందమతియు నాను అను పురందరదాసు కీర్తన గానం చేసి, చివరగా త్యాగరాజ స్వామి వారి మంగళం పవమానసుతుడు తో కచేరీని సంపూర్ణం చేసి ఆద్యంతం రసభరితంగానే కాక వర్ధిష్ణు కళాకారులకి స్ఫూర్తిదాయకంగా నిలిచింది నేటి కచేరీ.

విద్వాంసులని విదుషి శ్రీమతి భాస్కర హరిప్రియ గారు సత్కరించారు. వారి శిష్యురాలు శ్రీమతి సుసర్ల ప్రసన్న గారు వందనసమర్పణ చేశారు. పిమ్మట, అందరికీ విందు ఏర్పాటు చేశారు.

భాస్కర లలిత గారికి ఆద్యంతం రసభరితమైన సంగీత నీరాజనాన్ని అర్పించి ఆనందడోలికలూగించారు.

**శ్రీ సద్గురు సంగీత సభ, విజయవాడ,**
**శ్రీ త్యాగరాజస్వామి 259వ జయంతోత్సవ దృశ్యమాలిక**





# సంగీత విద్వాంసురాలికి సత్కారం రాజమహేంద్రవరం






రాజమహేంద్రవరం టీనగర్ లోని హిందూ సమాజంలో జరుగుతున్న శ్రీరామ నవమి సంగీతోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం వేలూరి లక్ష్మీతులసీ విశ్వనాథ్ గాత్ర కచేరీ అలరించింది. శ్రీరామ భక్త గానసభ నిర్వాహకుడు నిమ్మలపూడి వీర్రాజు నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గాత్ర విద్వాంసురాలు లక్ష్మీతులసీ విశ్వనాథ్ దంపతులను నిమ్మలపూడి పద్మావతీ స్మారక పురస్కారంతోపాటు సంగీత జ్ఞాన స్వరూపిణి బిరుదును ప్రదానం చేసి సత్కరించారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఆధ్యాత్మిక వేత్త కంబాల శ్రీనివాసరావు, దోర్బల ప్రభాకరశర్మ సంస్థ సేవలను ప్రశంసించారు.

# ఢిల్లీ ఆంధ్రా కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహణలో సంగీత కచేరి




శనివారం సాయంత్రం ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ బిల్డింగ్ గోదావరి ఆడిటోరియంలో ఆంధ్రా కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 2 రోజుల మెగా ఫెస్టివల్ లో పట్టణానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసుడు డాక్టర్ మండపాక రవి ప్రఖ్యాత వేణుగాన విద్వాంసులు విజయ గోపాల్ కచేరికి మృదంగంపై సహకారం అందించగా శ్రీధర్ వయొలిన్ పై కన్నన్ ఘటం పై సహకరించారు. ముఖ్యఅతిథిగా ఢిల్లీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వర రావు విచ్చేశారు... కార్యదర్శి వడ్లమాని ప్రసాద్ నిర్వహించారు

# ప్రతిభావంతంగా వీణ కచేరీ తో కూడిన సోదాహరణ ప్రసంగం...




విజయనగరం కొత్తగ్రహారం లో రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుపబడుతున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ లో మంగళవారం సాయంత్రం హైదరాబాద్ కి చెందిన ప్రఖ్యాత వీణ విద్వాంసులు, కేంద్రం సంగీత నాటక అకాడమీ అవార్డ్ గ్రహీత అయిన అయ్యగారి శ్యామ సుందరం వారి వీణ కచేరి కూడిన సోదాహరణ ప్రసంగం ప్రతిభావంతంగా సాగి అందరినీ అలరించింది. శాస్త్రీయ సంగీతం అన్నిటికి మూలమని అలాగే వీణ, మృదంగం, వేణువు ప్రాచీన వాద్యములని చెబుతూ వీణ పై పలు కృతులు వాయించి వాటి విశేషాలను, వాయించే పద్ధతులను తెలియజేశారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి మృదంగంపై సహకారం అందించారు. అకాడమీ సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ కె. ఎ.పద్మప్రియ నిర్వహణలో వీణ విద్యార్థులు ముందుగా ప్రదర్శనలు ఇచ్చారు. శ్రీధామ మృదంగంపై సహకరించారు. అనంతరం వైణిక దంపతులు శ్యామ సుందరం జయలక్ష్మి లను అకాడమీ "శ్రీ వీణావాదన వాగర్ధ" అనే బిరుదుతో ఘనంగా సత్కరించింది. డి ఎన్ ఆర్ స్కూల్ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు, అధ్యాపకులు మోడెకుర్తి వెంకట కామేశ్వర రావు, సతీష్, మంగతాయారు, శిరీష, మహేశ్వర రావు, శారద, నగరంలోని వివిధ సంగీత పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు, అధ్యాపకులు, స్థానిక కళాకారులతో పాటు అయ్యగారి రాఘవరావు, రోటీరియన్లు, తదితరలు హాజరయ్యారు.

**డాక్టర్ మండపాక రవి**



**శ్రీ శివరామ క్షేత్రం (రామకోటి), సత్యనారాయణపురం (విజయవాడ) లో జరిగిన శ్రీ పంచరత్న కీర్తనా గోష్ఠిగానం. సందర్భం : సద్గురు శ్రీ త్యాగరాజ జయంత్యుత్సవము.**

# తెలంగాణ జానపద సకల కళాకారుల JAC ఖమ్మం జిల్లా



ఏప్రిల్ 8 వ తేదీ రోజు తెలంగాణ జా న పద సకల కళాకారుల JAC ఖమ్మం జిల్లా నాయకులతో కలిసి తెలంగాణ సాంస్కృ తిక శాఖ డైరెక్ట ర్ గౌరవ శ్రీ ఏనుగు నర సింహా రెడ్డి IAS గారిని హైదరాబాద్ రవీంద్ర భా రతి కార్యాలయంలో కలవడం జరి గింది.

ఆయన గౌరవార్థం శాలువాతో సత్క రించి కళాకారుల సంక్షేమం కోసం గుర్తింపు కార్డులను జారి చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని తీసు కున్నం దుకు కృతజ్ఞతతో సన్మానించడం జరి గింది.

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతి క శాఖ మంత్రి గౌరవ జూపల్లి కృష్ణారావు గారి ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రం లోని వేలాది జానపద కళాకారుల కు దీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న గుర్తింపు కార్డులను జారి చేయాలని నిర్ణయించారు.

అందుకు సంబంధించిన DPRO జి ల్లా అధికారులకు సర్క్యులర్ జారీ చేస్తూ కళాకారుల గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేశారు

తెలంగాణ రాష్ట్రంలో గత పన్నేడేం డ్లు గా పెండింగులో ఉన్న వృద్ధ కళా కారుల ఫించన్లు మంజూరు చేసేం దు కు చర్యలు తీసుకోవాలని డైరెక్ట ర్ గారిని కోరడం జరిగింది.

పేదరికాన్ని అనుభవవిస్తూ అనా రో గ్యంతో బాధ పడు తున్న నిరు పేద జాన పద కళాకారులకు చట్టబద్ధంగ రావాలిసిన ఆర్థిక సహకారాన్ని అం దించాలని జానపద కళాకారుల సం క్షేమ JAC తరపున విజ్ఞప్తి చేసాం.

సాంస్కృతిక శాఖా డైరెక్టర్ గారు సా ను కూలంగా స్పందించి త్వర లోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వృద్ధ క ళా కారులకు ఫించన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసు కుంటామ ని తెలిపారు.

**మురళీధర్ దేశ్ పాండే.** TJP JAC అధ్యక్షుడు



**28.04.2026 శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, దేవరపల్లి శ్రీమతి కేశిరాజు శారదా దేవి గారి సంగీత కార్యక్రమం.**

# శ్రీ శ్యామశాస్త్రి సంగీతోత్సవం

కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో విశాఖపట్నం స్థానిక బి.వి.కె. కళాశాలలో మార్చి 4వ తేదీన మధ్యాహ్నం 3.30 గం. నుండి రాత్రి 9.30 గం. వరకు శ్రీ శ్యామశాస్త్రి గారి ఉత్సవము వైభవముగా జరిగినది. ఈ కార్యక్రమము నందు స్థానిక విద్యార్థినులు, విద్వన్మణులు అందరూపాల్గొని జయప్రదం చేసారు. 3.30 గం. లకు కుమారి పల్లవి, స్నిగ్ధ, సుమేధలు శంకరి శంకరు – సావేరి, సరోజ దళనేత్రి కృతులను చక్కగా ఆలపించిరి, తరువాత కుమారి పవిత్ర భైరవి స్వరజతి, మాయమ్మకృతి కుమారి ఐశ్వర్య ఆలపించారు. తరువాత కుమారి భావన – పాలించుకామాక్షి, హిమాద్రి సుతె, శంకరిశంకరు కృతులను, శ్రీ నిష్టల కార్తీక్ యదుకుల కాంభోజి స్వరజతి, పార్వతి నిను, జననీ, కృతులు మధురంగా ఆలపించారు. తరువాత కుమారి ఆముక్తమాల్యద, హర్షిత, కనిష్క, రుషితలక్ష్మి, శ్రీమతి సురభికిశోర్ భైరవి స్వరజతి, హిమాద్రిసుతే, శంకరి శంకరు, తరువాత కుమారి ఆర్. కృష్ణప్రియ, శంకరి – బేగడ, ఓ జగదంబ కృతులు ఆలపించారు. తరువాత శ్రీమతి ఎస్.వి. సుబ్బలక్ష్మి వీణావాదనంతో దురుసుగా – సావేరి, దేవిబ్రోవ – చింతామణి కృతులు పలికించారు.

తరువాత కుమారి కృష్ణశ్రుతి పరాకేల – కేదారగౌళ, మాయమ్మ, తల్లీ నిను, కృతులు, కుమారి హరిప్రియ పాలించుకామాక్షి, పరాకేల కృతులు తన వీణావాదనంతో మెప్పించారు. అనంతరము కుమారి విష్ణుప్రియ ఇందిర మీనలోచన, వేంకటశైల, మొ. కృతులు. శ్రీమతి ఆర్. కుసుమకుమారి నినువినా– రీతిగౌళ, కనకశైలవిహారిణి కృతులు ఆలపించారు. తరువాత శ్రీమతి మండపాక శ్రీదేవి పరాకేల, నినువినా కృతులు వీణమీద హృద్యంగా పలికించగా శ్రీమతి వీరఘంట లలితచంద్రశేఖర్ హిమాచల తనయ, శంకరిశంకరు, కామాక్షి కృతులు తమ గాత్రముతో అలరించారు. అనంతరము శ్రీమతి ఛండి శ్యామల తమ వీణావాదనంతో తల్లీ నిన్ను నెర అను కృతులు తమ శైలిలో మధురంగా ప్రదర్శించారు. చివరిగా శ్రీమతి నిష్టల కృష్ణవేణి కరుణజూడు–శ్రీరాగం, కామాక్షి–బేగడ కృతులు వీణ మీద రక్తిగా వాయించి కామాక్షి – మధ్యమావతి కృతితో మంగళం పలికిరి. ఈ కార్యక్రమానికి ఎస్. పార్థివ వయోలిన్ పై మృదంగంపై శ్రీ సి. అఖిలేష్, శ్రీ ఎం. కామేష్ చక్కని సహకారాన్ని అందించారు. చివరిగా ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.




కుమారి పవిత్ర




కుమారి ఐశ్వర్య




కుమారి భావన




శ్రీ నిష్ఠల కార్తీక్




కుమారి ఆముక్తమాల్యద, హర్షిత, కనిష్క,
ఋషిత లక్ష్మి, శ్రీమతి సురభి




కుమారి ఆర్ కృష్ణ ప్రియ



శ్రీమతి ఎస్ వి సుబ్బలక్ష్మి



కుమారి హరి ప్రియ




కుమారి విష్ణు ప్రియ




శ్రీమతి బండి శ్యామల



శ్రీమతి మండపాక శ్రీదేవి



కుమారీలు పల్లవి, స్నిగ్ధ, సుమేధ



శ్రీమతి ఆర్ కుసుమ కుమారి



కుమరి కృష్ణశృతి



శ్రీమతి లలితా చంద్రశేఖర్


శ్రీమతి నిష్ఠల కృష్ణవేణి

# భక్తిశ్రద్ధలతో అన్నమయ్య 618వ జయంతి





అన్నమయ్య 618 జయంతి పురస్కరించుకొని గురువారం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ మరియు రోటరీ దశిగి పేరాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్త నిర్వహణలో డాక్టర్ అయ్యగారి రాఘవరావు సహకారంతో కొత్తగ్రహారంలో గల రోటరీ మ్యూజిక్ అకాడమీ లో ఉదయం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. రాఘవరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించి అన్నమయ్య కీర్తనా వైశిష్ట్యాన్ని తెలియజేశారు. స్థానిక విద్వాంసులు విజయలక్ష్మి, జయంతి రమ, ఇవటూరి మెహెర్లత, విద్యార్థులు, అకాడమీ అధ్యాపకులు డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, శారద, మహేశ్వర రావు, మోడెకుర్తి కామేశ్వర రావు, మంగతాయారు తదితరులు పాల్గొని సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం చేశారు. అనంతరం పట్టణానికి చెందిన యువ కళాకారుడు మహదాసు నీలాద్రి దీక్షితార్ గానం అందరిని అలరించింది. నృసింహ జయంతి కూడా అవ్వడంతో అన్నమయ్య నృసింహ కీర్తనలు ప్రత్యేకించి గానం చేయగా వీరికి వయొలిన్ పై ఈశ్వరమ్మ, మృదంగం పై శివకుమార్ సహకరించారు.

ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి మరియు మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ అయినటువంటి డాక్టర్ మండపాక రవి కార్యక్రమం నిర్వహించారు. ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిదిని, విద్వాంసులను సత్కరించారు.

**– డాక్టర్ మండపాక రవి**

# విశాఖ మ్యూజిక్ అకాడమీ - విశాఖపట్నం
# వసంతకళావైభవం, సంగీతనృత్యకళారీతుల సంగమం

ఎప్పటిలాగే జనవరి నెలలో విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆ యేడాదిలో సమర్పించబోయే కార్యక్రమాల రూపకల్పన కోసం ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో, కార్యదర్శి శ్రీ వీరఘంట చంద్రశేఖర్– మెలమెల్లగా కనుమరుగవుతూన్న "యక్షగానం, నామ సంకీర్తనం, హరికథ" వంటి సంగీతనృత్య కళారూపాలకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చే విషయం తెరపైకి తెచ్చారు.

ఆ ముహూర్తబలమో కార్యవర్గ సంకల్ప బలమో, నాలుగైదు సమావేశాలలో, అకాడమి అయిదురోజుల వసంతకళావైభవ వేడుకలను మార్చి 23–27 తేదీలలో జరపాలని నిర్ణయించడం, కళాకారులను సంప్రదించి సంపూర్ణ వైవిధ్యభరితమైన కార్యక్రమాలను రూపొందించి, ప్రణాళికను అమలు పరచేదిశగా పరుగుదీయడం జరిగిపోయింది.

విశాఖ మ్యూజిక్ అకాడమీ స్థానిక కళాభారతి ఆడిటోరియంలో, ఊహించిన దానికంటే అధికమైన ప్రేక్షకుల ఆదరణమధ్య, మార్చి 23–27 తేదీలలో అయిదురోజుల వసంతకళావైభవ వేడుకలను ఘనంగా నిర్వహించి, అకాడమి ఎప్పుడూ కొత్తదనంతో ముందడుగు వేస్తుందని మరొకమారు ఆంధ్రదేశ సంగీతాభిమానులకు తెలియజేసింది.

మొదటిరోజు అనగా 23.03.26 నాటి సాయంత్రం ఆరున్నర గంటలకు శ్రీ వి.యస్.యన్. మూర్తిగారు "సకలకళావిశారదుల సార్థకవిద్యలు నీదు భక్తి కారకములు" అంటూ సరస్వతీ ప్రార్థనతో అందరికీ ఆహ్వానం పలికుతూ, ఈ వైవిధ్యభరితమైన అయిదు రోజుల కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. దీపప్రచోదనం, అకాడమి ఉపాధ్యక్షులు డా. పేరాల బాలమురళీకృష్ణ గారి సందేశం అనంతరం, అకాడమి ప్రతియేటా సమర్పిస్తూ వస్తూన్న శ్రీ భక్త జ్ఞానానంద తీర్థ ఓగిరాల వీరరాఘవశర్మ ఎండోమెంట్ పురస్కారం ఈ ఏడాదికి గాను తిరుపతికి చెందిన గాయని డా. RNS శైలేశ్వరి గారికి సమర్పించే సన్మాన




**శైలేశ్వరి గారి గాత్రసంగీత సభ – H.రామచరణ్ వాయులీనం , NS కల్యాణరామన్ మృదంగం.**



**శ్రీ వేదాంతం సత్యనరసింహ శాస్త్రిగారి సన్మానం. యక్షగానం**

కార్యక్రమం జరిగింది. అకాడమి డా.శైలేశ్వరి గారికి ఈ సందర్భంగా కుంకుమ చందనాదులతో పుష్పమాల, చందనమాల, శాలువ, జ్ఞాపికలతో పాటుగా ఫలప్రదానంచేసి, పేరాలవారి కూర్పుతో సన్మాన పత్రం సమర్పించింది. తగినవిధంగా సన్మానితురాలి స్పందన అనంతరం ఆమె గాత్రసంగీతసభ మహదానందంగా జరిగింది.

ఓగిరాలవారి జీవిత చరిత్రను, వారి రచనా వైదుష్యాన్నీ, సంగీత పరిజ్ఞానాన్ని వివరిస్తూ సాగిన డా. శైలేశ్వరి గారి కచేరీ, ఓగిరాల వారు రచించిన తోడిరాగ వర్ణంతో ఆరంభించడమే కాక, గంభీరనాట రాగంలో "అపారకృపానిధి", ఆనందభైరవి రాగంలో "నేడే నిను సేవింప", సామరాగంలో "భక్తికి సమభాగ్యము", పూర్వీకల్యాణి రాగంలో "ముందువారలేమైరో", అన్న ఓగిరాలవారి రచనలను గాయని ఆలపించడం సందర్భోచితంగా ఉంది. ఇవిగాక హంసధ్వనిరాగంలో "అభీష్టవరద", మానవతి రాగంలో "ఎవరితో నే", కీర్తనలు చోటుచేసుకున్నాయి. వీరికి వాయులీనంపై విద్వాన్ హెచ్. రామచరణ్ గారు తనకు లభించిన స్వల్పసమయంలోనే విద్వత్తును ప్రదర్శిస్తూ సహకరించారు. మృదంగంపై విద్వాన్ ఎన్. ఎస్.కల్యాణరామన్ గారు మృదుమధురంగా లయవిభాగాన్ని పోషిస్తూ లయవిన్యాసంతో ఆకట్టుకున్నారు. డా.రాయప్రోలు రమణిగారు సహకారగానంతో సభను రక్తి కట్టించారు.

రెండవరోజు అనగా 24.03.26 నాటి సాయంత్రం "అంతభారము మోయుటెట్లనుటన్న భీతిని వీడుచున్" అన్న స్వీయపద్యరచనతో శ్రీ వి.యస్.ఎన్.మూర్తి గణేశుని ప్రార్థించి సభాసదులకు ఆహ్వానం అందించిన పిదప అకాడమి అధ్యక్షులు శ్రీ కే.వి.రామ్మూర్తిగారు అందించిన సందేశంలో యక్షగాన కార్యక్రమ పూర్వాపరాలు తెలియజేశారు. 22మంది సభ్యులతో ఎంతో కష్టనష్టములను తట్టుకొని అకాడమిలో ఆనాడు "పార్వతీ పరిణయం" అన్న కూచిపూడి యక్షగాన కార్యక్రమం తన దర్శకత్వ ప్రతిభతో అందిస్తూన్న డా.వేదాంతం సత్యనరసింహ శాస్త్రిగారి పరిచయం మూర్తిగారు అందించారు.

అంతవరకే ప్రేక్షకులకు తామున్న పరిసరాలు తెలిసాయి. ఆ తరువాత రెండున్నర గంటల సమయం దృశ్యకావ్యం చూడడంలో మైమరపు,



**యక్షగాన బృందం సభ్యులతో అకాడమీ కార్యవర్గమంతా**

ఆనందాతిశయం, అమృతపానం తప్ప మరేమీ తెలియలేదనడంలో అతిశయోక్తి లేదు.

"సహనావవతు..... శన్నోమిత్రస్యం వరుణః" అన్న శాంతి మంత్రములు "అపవిత్ర పవిత్రోవా......" అంటూ వేదికను పతాకతో ధూపదీప నైవేద్యాలతో శుద్ధిచేశాక, "తాండవనృత్యకరీ గజానన..." అంటూండగా కుబ్జరూప గణపతి ప్రవేశమూ, "అవధరించరయ్యా విద్యలనాదరించరయ్యా..." అంటూ సూత్రధారి గా శాస్త్రిగారి ప్రవేశంతో కార్యక్రమం ఊపందుకుంది.

తారకాసురుని ప్రవేశదరువు, తగిన ఆహార్యంతో గంభీరమైన ఆకారంతో పాత్రకు తగినవిధంగా నృత్యం తో ఆకట్టుకున్నాడు పాత్రధారి.

నారదుని మార్గదర్శనంతో తారకాసురుని తపస్సు, బ్రహ్మ సాక్షాత్కారం తగినరీతిలో చూపారు దర్శకులు.

"వచ్చెనే నగరాజ పుత్రి....శివునికొలువ" – అంటూ పార్వతి ప్రవేశదరువు కన్నులపండగే. చెలుల మధ్యన సిగ్గునభినయిస్తూ, శివుని కోరుకుంటూన్న పార్వతిని చూసిన చెలులతో ప్రశ్నోత్తరాల దృశ్యాన్ని గొప్ప చాకచక్యంగా శాస్త్రి గారు చూపారు.

శివునికన్నా ముందు భృంగి ప్రవేశమూ – ఆతడు పార్వతి విషయం తెలిసి, "వింజామరలతో వీచితే శివుని సేవకన్నా పన్నగాలు పారిపోతాయి కాబట్టి పుష్పార్చనమే మేలు" అన్న మార్గం చూపడం– ఎన్నాళ్ళు పూజించినా కనువిప్పి చూడడే విశ్వనాథుడు – అంటూ ఆవేదన, పార్వతి శోకరస ప్రదర్శన ప్రేక్షకుల కంటనీరు తెప్పించింది. రతీ మన్మథుల ప్రవేశం – మన్మథుని ప్రణాళిక – రతీదేవి ప్రమాద హెచ్చరిక – ఒక అయిదారు నిముషాలు యిరువురూ "నువ్వా నేనా" అన్నరీతిలో పోటీగా నటించారు. ఆ తరువాత మన్మథుడు పార్వతీ దేవితో "తగదిది తగదిది ధరణీధరవర సుకుమారీ" అంటూ అభినయం – "ఈశుని దాసుని చేతువా" అంటూ పార్వతీ దేవి వలదనడమూ మన్మథ బాణప్రయోగమూ మంచి నట్టువాంగం తో, సంగీత మేళవింపుతో జరిగాక కోపగించిన శివుని తాండవం ఒక గొప్ప దృశ్యం సంగీత నృత్యాభినయాల ప్రదర్శనతీరు వర్ణనాతీతం.




**విద్వాన్ దరూరు రాఘవాచారి గాత్రం, శ్రీ M.నీలాద్రిరావు – వాయులీనం, శ్రీ M. ఏడుకొండలు మృదంగం.**



**ముఖ్య అతిథి శ్రీ సాంప్రతి సురేంద్రనాథ్ (ముంబయి) గారికి అకాడమి సన్మానం**

చూసి తరించ వలసినదే. మన్మథ దహనానంతరం రతీదేవి వేదన – పార్వతి వేడుట – శివుడు కరుణించి మన్మథుని సశరీరునిగాకాక సజీవునిగా జేయుట చూపాక శివపార్వతుల ఆనంద నృత్యహేల పతాక సన్నివేశం గా బహు ప్రశంసాపాత్రమైంది.

మరల శాంతి మంత్రములు – ఈశ్వరస్తుతి – మంగళసూత్రధారణతో మంగళాదీని – మంగళాంతం అన్న వేదవిధితో మంగళంతో కార్యక్రమం మనోహరంగా ముగించారు కళాకారులు. మరి ప్రేక్షకులను అంతగా స్వర్గలోకాలలో విహరింపజేసిన కళాకారుల పేరైనా చెప్పాలిగా పార్వతి – కుమారి శరణ్య, తారకాసురుడు మరియు శివుడు – శ్రీ మధుసూదన్, నారద – కుమారి సునిధి, మన్మథుడు – కుమారి శ్రీజ వైష్ణవి, రతీదేవి – కుమారి లేఖన, భృంగి మరియు మంత్రి – చి.అఖిల్, బ్రహ్మ మరియు వేత్రహస్తుడు – శ్రీ శీనయ్య చెలికత్తెలు – మానస, యామిని, సునీత, లాలిత్య, వైష్ణవి, కావ్యం శ్రీ అనఘ. రాక్షసులు – వెంకటేశ్, శివప్రసాద్. గాత్ర సహకారం – శ్రీమతి శాంతి, వాయులీనం – శ్రీ పాణ్యం దక్షిణామూర్తి మృదంగం – శ్రీ శ్రీధరాచారి, తబల – శ్రీ ప్రకాశ్, ఆహార్యం – సురభి దినకర్ కళాకారులందరినీ ప్రెసిడెంట్ ఎమిరటస్ డా.యస్వీ రంగరాజన్ మరియు అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తి ఫలప్రదానం మరియు మాలలతో సత్కరించి అభినందించారు. అద్భుతమైన యక్షగాన కార్యక్రమం చాలారోజులు ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోతుంది అనడానికి సందేహంలేదు.

మూడవరోజు అనగా 25.3.26 నాటి సాయంత్రం అకాడమీ ముందుగానే నిర్ణయించుకున్న ప్రణాళిక ననుసరించి సంగీత ప్రక్రియలైన పదము, జావళి, అష్టపది, తరంగం వంటి అంశాలనే ఎన్నుకొని కచేరీని నిర్వహించడం జరిగింది. "నీహారసార ఘనసార సుధాకరాభాం" అంటూ సరస్వతి ప్రార్థనతో శ్రీ వి.యస్.యన్. మూర్తి ఆహ్వానం పలికి కళాకారుల పరిచయం చేసినవెంటనే ఆనాటి కళాకారులు, హైదరాబాద్ బ్రదర్స్ లో ఒకరైన గాత్రవిద్వాంసులు శ్రీ దరూరు రాఘవాచారి గారు కచేరీని ఆరంభించారు. సభా సాంప్రదాయాన్ని అనుసరించి ఒక్క అరగంట సమయంలో " ఏరా నాపై" అన్న తోడి రాగం వర్ణం, అఠాణ రాగంలో "ముమ్మూర్తులు గొని", నాయకి రాగంలో "కనుగొను సౌఖ్యము" ,దేవరంజి రాగంలో "నమస్తే పరదేవతే", కలగడ రాగంలో "పార్వతి నిను



శ్రీమతి జయంతి సావిత్రిగారి హరికథ




శ్రీమతి తుషార పూర్ణవల్లి బృందం – నామసంకీర్తనం

నే" కీర్తనలను ఆలపించి, మిగిలిన రెండుగంటల కాలమూ, ముఖ్యాంశంతో సహా, అకాడమి కోరిన విధంగానే సభను నడిపించారు రాఘవాచారి. హంసధ్వని రాగంలో జావళి "నెఱమొఱ జారచోర", తో మొదలుపెట్టారు.

చిక్కనైన రాగాలాపన స్వరకల్పనతో కరతాళధ్వనులందుకున్నాక, కేదారరాగంలో "ఎంతని వర్ణింతునే సఖీ" జావళీ, కల్యాణి రాగాలాపనానంతరం ధర్మపురి సుబ్బరాయర్ రచన "ఎంతటి కులుకే", అంశాన్ని విస్తృత స్వరకల్పనతో అందించి, సావేరి రాగంలో "లేమరో మా మువ్వ గోపాలుడు" అన్న క్షేత్రయ్య పదం, ఆభేరి రాగంలో "గోవిందమిహ గోపికానంద కందం" నారాయణ తీర్థుల తరంగం, హంసానంది రాగంలో "క్షణమదునా నారాయణా" జయదేవుని అష్టపదిని వినిపించి – సంగీతజ్ఞానము గాత్రసౌలభ్యమూ గలవారికి అంశాలేవైనా సభను రక్తికట్టించడం సులభసాధ్యం అని నిరూపించారు దరూరువారు. అనంతరం మాట్లాడిన కార్యదర్శి శ్రీ చంద్రశేఖర్ అకాడమీ తీసుకున్న నిర్ణయం ఎంత సముచితమో ఈ కచేరి తెలియజేసిందని సంతోషం వ్యక్తం చేశారు. రాఘవాచారిగారికి వాయులీనంపై విద్వాన్ మహదాసు నీలాద్రి రావు, మృదంగంపై విద్వాన్ మహదాసు ఏడుకొండలు గారలు మెచ్చుకోదగిన రీతిలో సాహిత్య భావాన్నీ స్వరకల్పనల రీతిని గమనిస్తూ సహకారం అందించి కరతాళధ్వనులందుకున్నారు.

నాలుగవ రోజు అనగా 26.03.26 నాటి సాయంత్రం శ్రీ వి.యస్.యన్.మూర్తి తమ గురువుగారు, ఆనాటి గౌరవ అతిథి అయిన శ్రీ సాంప్రతి సురేంద్రనాథ్ గారు రచించిన "ఒకచాయ బృందావనోద్యాన వనసీమ" అన్న పద్యమాలాపించి ఆహ్వానం పలికిన అనంతరం, ఆరోజు హరికథా గానం చేయనున్న శ్రీమతి జయంతి సావిత్రిగారిని సహకారం అందిస్తూన్న విద్వాన్ హెచ్.రామచరణ్ మరియు విద్వాన్ సుసరాపు సుబ్రహ్మణ్యం గారల పరిచయం గావించారు. తరువాత గౌరవ అతిథి శ్రీ సాంప్రతి సురేంద్రనాథ్ గారు కళాకారులకు ఫలప్రదానం గావించి హరికథా పితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారి గురించి విలువైన విషయాలు తెలియజేశారు. తదుపరి ఆరంభమైన సావిత్రిగారి "హనుమత్ సందేశం" హరికథా గానం ఆద్యంతం రసవత్తరంగా శ్రావ్యమైన గానంతో, ఆదిభట్లవారి రమ్యమైన సాహిత్యవైభవంతో, బేహాగ్, యమన్, పూర్వీకల్యాణి, కాపీ, మోహనకల్యాణి, తోడి, బృందావన సారంగ, హమీర్ కల్యాణి, శహన, వంటి రాగాలలో స్వరపరచిన పద్యాలు గీతాల ఆలాపనతో వీనులవిందొనరించింది. కేవలం ఏదో పురాణకథ చెప్పినట్లు కాకుండా, అభినయం, నృత్యం, హాస్యం, సమయస్ఫూర్తి జోడించి హరికథను నడిపించిన తీరు ప్రశంసనీయం. వాయులీనంపైన శ్రీ రామచరణ్ మృదంగంపైన శ్రీ సుబ్రహ్మణ్యం గారల సమయోచిత అనుభవపూర్వక సహకారం కార్యక్రమాన్ని రక్తి కట్టించింది.

చివరి రోజైన శ్రీరామనవమి దినాన అనగా

27.03.26 సాయంత్రం "రామా! శ్రీరామచంద్రా! రఘుకులతిలకా! రాఘవా! నీలమేఘా" అన్న స్వీయ పద్యరచనతో రాముని స్తుతించి, శ్రీ వి.యస్. యెన్.మూర్తిగారు నామసంకీర్తనం వివరాలను తెలియజేసి, ఆరోజు ఆ కార్యక్రమం అందిస్తూన్న విదుషి శ్రీమతి తుషార పూర్ణవల్లి గారినీ, వారి బృందాన్నీ పరిచయం గావించారు. అధ్యక్షులు శ్రీ కేవి రామ్మూర్తి గారు కళాకారులకు ఫలప్రదానం చేసిన వెంటనే గాయని తమ పూర్వీకులైన రాయపూడి, అద్దంకి, యింటిపేరుగల వారి నామ సంకీర్తన వైభవం చెప్పి, నాటరాగంలో "జయజయ స్వామిన్ " అంటూ, "నారాయణహరి" అన్న నామం సంకీర్తనం ఆరంభించారు. వైవిధ్యమైన కీర్తనల పల్లవులెన్నుకున్నా, నామసంకీర్తనం శ్రీరామనవమి సందర్భంగా రాముని నామంతో జరగడం విశేషం.

"శరణు శరణు సురేంద్ర సన్నుత" అన్నా, "రామభద్రరారా" అన్నా, చివర గోవింద నామమో, రామనామమో హాలులో మారుమోగాల్సినదే. "రామా కోదండరామా", "దశరథనందన రామా", "ఓ రామ నీనామ మేమిరుచిరా", "తక్కువేమి మనకూ" , అన్న రామనామంతో పాటు, "వనమాలీ రాధారమణా", "నరహరిదేవా జనార్దనా", "నాచెపాండురంగా" అన్న భజనసాంప్రదాయ అంశాలతో,గాయని వెనుకనే ప్రేక్షకులు గొంతుకలిపి భక్తిరసంలో లీనమయేటట్లు చేయగలిగారు తుషార పూర్ణవల్లి. ఇక ఆమె ఎన్నుకున్న రాగాలు :

నాట, ఆభేరి, ఆరభి, కల్యాణి, మధ్యమావతి, ఆనందభైరవి, నాదనామక్రియ, మోహన, సౌరాష్ట్ర, కాంభోజి, బేహాగ్, బౌళి, దర్బారీ కానడ, పూర్వీకల్యాణి, శంకరాభరణం, యిలా ఒక వెల్లువగా వినిపించాయి.

ఈ కార్యక్రమం ఇంత జనరంజకంగా జరగడంలో వీరికి సహకరించిన చిన్నారి గాయనీమణుల పాత్ర గొప్పది. ప్రార్థననుంచి మంగళం వరకూ ఒక్క అక్షరమైనా వీడకుండా గోవువెంట దూడవలె అనుసరించిన ఘనత ఆ చిన్నారులు అయిదుగురు శిష్యులదే. ఎంతోశ్రద్ధగా గురువునుండి నేర్చుకుంటేగానీ అంత ఉత్సాహంగా గానం చేయలేరు.

వారు వరుసగా చిరంజీవి ధాత్రి శ్రీతేజ, చిరంజీవి హరిద్ర, చిరంజీవి రిషిత కృష్ణ, చిరంజీవి సంహిత, చిరంజీవి పావనలక్ష్మి.

ఇక వాద్యవిభాగాన్ని సమర్థవంతంగా పోషించిన కళాకారులు, అవకాశం లభించినచోట స్వీయప్రతిభను ప్రదర్శిస్తూ, కీర్తనకు తగిన రీతిలోనూ, వెనువెంటనే సాగే నామసంకీర్తనకు తగినవిధంగానూ, తమతమ వాద్యాలపై విద్యా ప్రదర్శనం చేసి పలుమారు కరతాళధ్వనుల నందుకున్నారు.

హార్మోనియంపై శ్రీ కన్నేపల్లి వెంకట సుబ్బారావు గారు, వాయులీనంపై శ్రీ కె. సుబ్రహ్మణ్య రాజుగారు, ఒకమృందంగంపై శ్రీ అరవింద్ కుందుర్తిగారు, రెండవ మృదంగంపై శ్రీ KPCS కార్తికేయ ఆదినారాయణ శర్మగారు కార్యక్రమ నిర్వహణకు నాలుగు స్తంభాలవలె నిలబడి నాదమయం చేశారు కళాభారతిని.

ఘనంగా ముగిసిన ఈ అయిదు రోజుల "వసంతకళా వైభవం" వేడుకల విజయంలో అకాడమీ కార్యవర్గమంతా తలోచేయి వేసినా ఉపాధ్యక్షులు శ్రీ బి.ఏ.రాజారావుగారి సమయోచిత సూచనలు, ఉపాధ్యక్షులు డా.పేరాల బాలమురళీకృష్ణ గారి అక్షరవిన్యాసం, సభల విశ్లేషణలతో కూడిన దైనందిన సమీక్ష, సహకార్యదర్శులైన శ్రీయుతులు అయ్యగారి భుజంగరావు మరియు మంథా జ్వాలా ప్రసాద్, గారల ద్విగుణీకృతమైన ఉత్సాహంతో చేసిన కార్యనిర్వహణ తీరుతెన్నులు, కోశాధికారి శ్రీ సి.హెచ్.దుర్గాప్రసాద్ గారి ఆర్థిక క్రమశిక్షణ, హైదరాబాద్ నుండి వచ్చి ప్రోత్సాహమందించిన ప్రెసిడెంట్ ఎమిరటస్ డా. యస్వీ రంగరాజన్, గారల పాత్ర గొప్పది. ఇంకా యథానుకూలంగా సహాయసహకారాలు అందించిన కార్యవర్గ సభ్యులందరూ అభినందనీయులే. ప్రతిరోజూ సమయపాలన చేస్తూ సరియైన సమయానికే శ్రీ వి.యస్.యెన్ మూర్తిగారి ఆహ్వానంతో మొదలవడమే అకాడమీ కార్యదీక్షకు గొప్ప ఉదాహరణ. కార్యక్రమం రూపకల్పన చేసిన అకాడమి కార్యదర్శి శ్రీ వీరఘంట చంద్రశేఖర్ తన ఆనందాన్ని పలుమారు ఈ అయిదు రోజులలో వ్యక్తం చేస్తూ తనబృందాన్ని ఉత్సాహపరుస్తూ ముందుకు నడిపింపజేస్తూ, కళాకారులతో సహా అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

ఇంత వైవిధ్యభరితమైన విశేష కార్యక్రమాలు కడదాకా వీక్షించడానికి "వంటా వార్పూ" అడ్డు పడకుండా అకాడమీ ప్రతిరోజూ సభానంతరం "ప్రసాద వితరణ" గావించడం తగిన ఫలితాన్నిచ్చిందనే చెప్పాలి సుమారు ఆరు దశాబ్దాలుగా అకాడమీ విజయపరంపరకు సభ్యులు క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడచే విధానమే కారణమని ఈ వేడుకలు మరొకమారు రుజువు చేస్తూ, విశాఖ రసికులకు మంచి అనుభూతిని మిగిల్చాయి అన్నది – ప్రేక్షకుల మాట.

**వియెస్సెన్మూర్తి, విశాఖ మ్యూజిక్ అకాడమి.**



**27.3.2026 కాకినాడ శ్రీరామసమాజం ఉచిత సంగీతపాఠశాల లో జరిగిన శ్రీసీతారామకల్యాణంలో స్వామి వారికి నాట్యార్చన సమర్పించిన "శ్రీపర్ణికానాట్యాంజలి"విద్యార్థినులు. గురువు శ్రీమతి బి.సౌమ్యామల్లికార్జున్.**

# శంకరమఠం మరియు విజయ త్యాగరాజ సంగీత సభ
## విశాఖపట్నం వారి అధ్వర్యవంలో "బాలమేధావి" కుమారి దావులూరి శ్రీవిద్య వయొలిన్ కచేరి



జగద్గురు శంకరాచార్య జయంతి సందర్భంగా స్థానిక శంకరమఠం AC ఆడిటోరియంలో "శ్రీ కంచి కామకోటి శంకరమఠం" మరియు "శ్రీ విజయ త్యాగరాజ సంగీత సభ" సంయుక్త నిర్వహణలో, "బాలమేధావి" కుమారి దావులూరి శ్రీవిద్య వాయులీన కచేరి తే. 25.04.2026 ది శనివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి సహప్రాయోజకులు శ్రీ నాగేంద్రనాథ్ వారి అర్థాంగి శ్రీమతి మహాభాష్యం సుగుణగారి దివ్యస్మృతిలో ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమ నిర్వహణలో శ్రీ అచ్యుత రామయ్య, కార్యదర్శి శంకరమఠం, శ్రీ చాగంటి శర్మ, కార్యదర్శి విజయ త్యాగరాజ సంగీత సభ, శ్రీ బి.ఏ. రాజారావు, వైస్ ప్రెసిడెంట్ విశాఖ మ్యూజిక్ అకాడమీ, శ్రీ యమ్.యస్.శ్రీనివాస్, సెక్రటరీ ఎమిరిటస్ విశాఖ మ్యూజిక్ అకాడమీ, శ్రీ యమ్.జ్వాలాప్రసాద్, విజయత్యాగరాజ సంగీత సభ, డా. దావులూరి సుజాత దంపతులు (శ్రీవిద్య తలిదండ్రులు) పాల్గొన్నారు.

కుమారి శ్రీవిద్యకు శ్రీ చాణక్యచంద్ర (కవిటి) మృదంగంపై సహకరించారు.

మొదటగా కానడవర్ణంతో ఆరంభమైన నాటి సభలో "వరవల్లభ రమణ" (హంసధ్వని), "దివాకర తనూజం" (యదుకుల కాంభోజి), "బ్రోవభారమా" (బహుదారి), "నమ్మి వచ్చిన" (కల్యాణి – కొవ్వూరి సుందరేశుని కృతి), "నిరవధి సుఖదా" (రవిచంద్రిక), "కృపయా పాలయా శౌరే" (చారుకేశి), సింహేంద్రమధ్యమం లో "రాగం–తానం–పల్లవి" అంశాలు చోటుచేసుకున్నాయి. పల్లవిలో నళినకాంతి, రేవతి, కాపి, బేహాగ్, రాగమాలిక ఆకర్షణీయంగా ఉంది. ఒక మంచి వాయులీన కచేరివిన్నామన్న సంతృప్తి కలిగించింది శ్రీవిద్య. శ్రీ చాణక్యచంద్ర మృదంగంపై అత్యంత ధ్వని సుందరంగా సహకరించారు. డా.పేరాల సమీక్ష అనంతరం పండిత ఆశీర్వచనంతో సభ సుసంపన్నమైనది.

**డా. పేరాల బాలమురళీకృష్ణ**
గానకళ విలేఖరి



**సద్గురు సన్నిధి, రాజమహేంద్రవరం లో అన్నమయ్య ఉత్సవంలో శ్రీ శిష్టు మధుసూదన్ గానం. శ్రీ యు.శ్రీహరి ప్రసాద్ –వైలన్; శ్రీరవితేజ –మృదంగం.**

## మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల వార్షికోత్సవము, విజయనగరం విద్యార్థుల కళాప్రదర్శనము 27-04-2026



























విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్
గౌ.శ్రీ ఎం. నాగలక్ష్మి




శ్రీమతి నిర్మల జ్యోతి జాయింట్ కమిషనర్, స్టేట్ G.S.T
ప్రసంగిస్తున్న దృశ్యం




సంగీత త్రిమూర్తుల గురించి ప్రసంగిస్తున్న విద్వాన్ డా. ఎన్. సి. రంగాచార్యులు

# స్వర భారతి, తిరుపతి - 21వ కార్యక్రమం 19-04-2026



శ్రీ జి.వెంకట రమణ గారు గాత్ర కచేరీ (తిరుపతి), వయోలిన్: శ్రీనివాస్ వాయునందన్, మృదంగం: జి.టి. లక్ష్మీకాంతం, ఘటం: ఎల్.ప్రసాద్ వారి కచేరి గణేష్ కృతితో ప్రారంభించి ప్రణమామ్యహం– గౌల రాగం, ఆది తాళం; నిన్నే భజన సేయు – నాట రాగం, ఆది తాళం; కోరిన వరమొసగు–రామప్రియ రాగం, ఆది తాళం; భజరే మానస – అభేరి రాగం, ఆది తాళం అంశాలు వినిపించారు.



తిరుపతిలోని కళాకారులు మరియు విద్యార్థులచే శ్రీ శ్యామశాస్త్రి గారికి నివాళులర్పించే కార్యక్రమం గాత్రం : కొమందూరి శేషాద్రి గారు, కొమందూరి వెంకట కృష్ణ గారు, వయోలిన్: శ్రీనివాస్ వాయునందన్, మృదంగం : రఘురాం గారు, మాయమ్మాయని నే– ఆహిరి రాగం, ఆది తాళం; మరివేరే గతి – ఆనంద భైరవి రాగం చాపు తాళం కీర్తనలు వినిపించారు.



గాత్రం:సంహిత, వయోలిన్: వెంకట వాయునందన్, మృదంగం: కృష్ణ వంశీ. సరియెవ్వరమ్మ–భైరవి రాగం ఖండజాతి జంపెతాళం



గాత్రం: హరి చందన, వయోలిన్: శ్రీనివాస్ వాయునందన్, మృదంగం : కవిరాజు, నన్ను బ్రోవ – లలిత రాగం.



గాత్రం : అనన్య, వయోలిన్: కె.వి. కృష్ణ గారు, మృదంగం: కృష్ణవంశీ, రావే పర్వత రాజ కుమారి– కళ్యాణి రాగం, జంపె తాళం



గాత్రం:శరద్యుతి, వయోలిన్: శ్రీవాణి, మృదంగం :కవిరాజు హిమాచల తానయ– ఆనంద భైరవి రాగం, ఆది తాళం



గాత్రం : రాజేశ్వరి, వయోలిన్ : వైనతేయ, మృదంగం : కవిరాజు, శంకరి శంకురు – సవేరి రాగం, తిస్ర ఆది



గాత్రం:కొల్లూరు వందన, వయోలిన్: కొమందూరి వెంకట కృష్ణ, మృదంగం : రఘురాం, బ్రోవ సమయమిదే– పున్నాగవరాలి రాగం, ఆది తాళం వీరి గాత్రంతో ఆనాటి కార్యక్రమం సుసంపన్నం అయ్యింది.

# త్యాగరాజ ఆరాధన ట్రస్ట్, విశాఖపట్నం
# త్యాగరాజ స్వామివారి 259వ జయంతి ఉత్సవాలు













# భారతీయ కళాసమితి, అలకాపురి, హైదరాబాద్
# త్యాగరాజ స్వామివారి 259వ జయంతి ఉత్సవాలు

పై సభ ఆధ్వర్యాన అలకాపురి ఉద్యానవనంలో మే 4నుండి త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ప్రారంభం నాడు ప్రముఖ వైలన్ విద్వాంసులుశ్రీ టికెవి రామానుజాచార్యులు గారిని "సంగీతభారతి" బిరుదుతో సత్కరించడం జరిగింది. సభలో డా.పాలకుర్తి మధుసూదనరావు,శలాక రఘునాథ శర్మ గారలు పాల్గొన్నారు అనంతరం కేరళ విద్వాంసులు శ్రీ శంకరన్ నంబూద్రి కచేరి ప్రతిభావంతంగా జరిగింది.

రెండోరోజు డా. హరిణి కచేరీతో ప్రారంభమై, రెండవ కచేరీగా జుగల్బందిలో సుధాకర్ భాగవతుల గాత్రం శ్రీ నందకుమార్ సితార్ తో ముగిసింది. ముఖ్య అతిథిగా జస్టిస్ జి.భవానిప్రసాద్ గారు కళాకారులను సత్కరించారు.

మూడవరోజు కూచిపూడి మరియు భరతనాట్యంతో ప్రారంభమై శ్రీమతి శ్వేతా ప్రసాద్ గాత్ర కచేరీ జరిగింది.శ్రీ వి.ముకుందశర్మ ముఖ్య అతిథి గా విచ్చేసి కళాకారులను సత్కరించారు.

నాల్గవరోజు కుమారి పూర్ణిమ శ్రీమతి ఫణి శిరీష ల వీణా వాయిద్యం తో ప్రారంభమై డా.కె. వాగీశ్ గాత్ర సంగీత సభ అలరించింది.

ఐదవరోజు శ్రీ కల్లూరి శ్రీనివాస్ వీణతో ప్రారంభమై ప్రిన్స్ రామవర్మ గారి కచేరీ రసికుల మనసులు దోచుకున్నది.

ఆరవరోజు ఉదయం అఖండ నాదార్చన లో నలభై మంది కళాకారులు పాల్గొన్నారు. సాయంత్రం చి॥కుశాల్ వైలన్తో ప్రారంభమై విదుషి సుకన్యారామగోపాల్ గారి ఘటతరంగిణి ఆహ్లాదంగా జరిగింది.

ఏడవరోజు ఉదయం జంట నగరాల కళాకారులచే త్యాగరాజ స్వామివారి ఘనరాగ పంచరత్న కీర్తనల గోష్టిగానం జరిగింది.సాయంత్రం



సప్తవాయిద్య తరంగిణి జరిగింది.

ఎనిమిదవ రోజు చి॥శ్రీయశస్వి గాత్రంతో మొదలై విద్వాన్ టికెవి.రామానుజాచార్యుల వైలన్ ,విదుషి ఈమని లలితకృష్ణల వీణా వైలన్ జుగల్బంది ఉర్రూతలూగించింది. ఈకార్యక్రమానికి శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్మరియు రాధాధీరజ్ రెడ్డి ,శ్రీ చిలుక ఉపేందర్ రెడ్డి, డా.పి.రఘు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాలు విజయవంతంగా జరగడానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు శ్రీ తాండవ కృష్ణ ధన్యవాదములు తెలిపారు.








































ప్రతిభా మూర్తులు,సద్గురువులు స్వర్గీయ ఇవటూరి విజయేశ్వరరావు జయంతి సందర్భంగా 16.5.26న విశాఖ శంకరమఠంలో విదుషి శ్రీమతి కస్తూరి కమలదీప్తి గాత్ర సంగీత సభకు విదుషి శ్రీమతి మంథా శ్రీరమ్య వైలన్, శ్రీ కె. సద్గురుచరణ్ మృదంగ సహకారాలు. సభలో శ్రీ విజయేశ్వరరావుగారి సద్గుణములు గురించి, శిష్య వాత్సల్యం గురించి పలువురు స్మరించుకొన్నారు.

# విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖపట్నం




విశాఖ మ్యూజిక్ అకాడమీ తన నెలవారీ కచేరీలలో భాగంగా 18.04.2026, శనివారం సాయంత్రం చెన్నయికు చెందిన వైణికవిద్వాన్ భరద్వాజ రామన్ గారి వీణావాదనసభ ఏర్పాటు చేసింది. వీరికి వాయులీనంపై కుమారి వ్యాకరణం గాయత్రి విభావరి, మృదంగంపై విద్వాన్ ధన్వాడ ధర్మారావు, ఘటంపై శ్రీ యస్. హనుమంతరావు సహకరించారు.

తన తాతగారైన ప్రఖ్యాత వైణికులు శ్రీ యస్. బాలచందర్ గారి శైలిలో సాగిన ఈ సంగీతసభ శ్రోతలను అలరించిందనడంలో సందేహంలేదు. మోహన్‌వర్ణం,శ్రీరాగంలో త్యాగరాజపంచరత్నకీర్తన "ఎందరో మహానుభావులు", దేవ గాంధారి రాగంలో "క్షీరసాగర శయన", శ్యామశాస్త్రి విరచితమైన భైరవి "స్వరజతి", వసంత రాగంలో "సీతమ్మ మాయమ్మ",ముఖ్యాంశంగా హిందోళరాగ కీర్తన "సామజవరగమన", వంటి రసిక మనోరంజకమైన అంశాలు కచేరీలో స్థానం సంపాదించుకున్నాయి. ప్రేక్షకులను తృప్తిపరచేవిధంగా ఎక్కువ అంశాలు సంఖ్యాపరంగా అందించడానికి కళాకారుడు రాగాలాపనలు, నెరవల్, స్వరకల్పనలు నామమాత్రంగానే తీసుకోవడం గమనార్హం. సహకారమందించిన విద్వాంసులందరూ తమతమ స్వీయప్రతిభను ప్రదర్శించి, సమయానుకూలంగా సద్వినియోగం చేసుకొన్నారు.

**వియస్సెన్మూర్తి**
విశాఖ మ్యూజిక్ అకాడమీ.

## శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.

శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్. నిర్వహణలో సెనెట్ ఆమోదం పొందిన ఒక సంవత్సరకాలపరిమితి శ్రీభద్రాచల రామదాసు కీర్తనల ఆన్లైన్ సర్టిఫికెట్ బోధన ప్రాజెక్ట్ ను ది.13.5.2026న తెలంగాణ గవర్నర్ గౌ.శ్రీ శివప్రతాప్ శుక్లా లాంఛనంగా గవర్నర్ భవనం నుండి ప్రారంభించారు. జూన్ నెల లో నోటిఫికేషన్ విడుదలై జూలై నుండి బోధన ప్రారంభ మవుతుందని తెలుస్తున్నది. విదుషి శ్రీమతి శేషలతా విశ్వనాథ్ కో–ఆర్డినేటర్ గా వుంటారు.





# త్రిమూర్తుల ఆరాధనోత్సవం.యన్.సి.ఆర్ సంగీత పరిషత్, కాకినాడ

శ్రీరామ సమాజ భవనంలో, రంగయ్య నాయుడు వీధి, కాకినాడ. తే.26.4.2026 ఆదివారం సాయంకాలం 6గంటలకు విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి–గాత్రం. విద్వాన్ శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి–గాత్రం. కె.సుబ్బరాయన్–వైలన్; శ్రీ ఎ.అనిల్ కుమార్–మృదంగం. మరియు శిష్యులచే విద్యా ప్రదర్శన. అనంతరం... డా.విద్వాన్ యన్.సి.రంగాచార్యులు మరియు డా.విద్వాన్ టి.కె వి.రామానుజాచార్యులు గారలచే సోదాహరణ ప్రసంగం జరిగింది. సంగీత సాహిత్యాల విలువలను కాపాడాలని విద్యార్థులలో ప్రచారం చేయడానికి శ్రీ రంగాచార్యులు గారు, రామానుజాచార్యులుగారు ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా పర్యటించి సమావేశాలలో సోదాహరణ ప్రసంగాలతో విద్యార్థులలో, గురువులలో చైతన్యం కలగజేస్తున్నారు. 83 ఏళ్ల వయసులో రంగాచార్యుల వారి ఈ యాత్ర ప్రసంశనీయమైనది. శ్రీరామ సమాజం ట్రస్టీ మరియు కార్యదర్శి శ్రీ మునుగంటి వెంకటరావు కార్యక్రమ నిర్వహణ చేసి వందన సమర్పణ చేసారు.

















## సరస్వతీ గానసభ - త్యాగరాజ సేవా సమితి, కాకినాడ

సరస్వతీగానసభ, కాకినాడ. వారి నిర్వహణలో 22.4.26న త్యాగరాజ జయంతి ఉత్సవం త్యాగరాజ సేవాసమితి సహకారంతో భక్తి శ్రద్దలతో జరిగింది. స్థానిక విద్వాంసులందరూ ఇందు శిష్య సమేతంగా పాల్గొన్నారు. శ్రీమతులు పెద్దాడ సూర్యకుమారిగారి శిష్యులు సా॥4.00 గం॥ల నుండి సా॥ 4.30 గం॥ల వరకు నాదస్వర మంగళ వాయిద్యములు. నాదస్వరం : శ్రీ పసుపులేటి వెంకట రమణ, శ్రీ చిట్టి బాబు, డోలు : శ్రీ వెంటూరి రామారావు బృందం.

సా॥గం॥ 5.00 లకు పూజ, సా॥ గం॥ 5.30 నుంచి స్థానిక కళాకారులచే పంచరత్న సేవ, సా॥ 6.30 నుండి శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు గారు– గాత్రం, శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి గారు మరియు శిష్యులు– గాత్రం, శ్రీమతి G. అరుణ గారు మరియు శిష్యులు– గాత్రం, శ్రీ విష్ణుభొట్ల శ్రీరామచంద్రమూర్తి గారు మరియు శిష్యులు– గాత్రం, శ్రీ ద్విభాష్యం నగేష్ బాబు గారు–వీణ, శ్రీమతి చిలుకూరి సుబ్బలక్ష్మి గారు మరియు శిష్యులు – గాత్రం.

శ్రీమతి ఆత్మకూరి పుష్పా రామ్మోహన్ గారు మరియు శిష్యులు – గాత్రం, శ్రీ మహేంద్రవాడ నరసింహమూర్తి గారు మరియు శిష్యులు– గాత్రం, శ్రీమతి చావలి సూర్య కుమారి గారు మరియు

శిష్యులు- గాత్రం, శ్రీ ఇ.వి. కృష్ణమాచార్యులు గారు మరియు బృందం- గాత్రం, శ్రీమతి M. విజయ కుమారి గారు మరియు శిష్యులు- గాత్రం, శ్రీ B.V.S.శర్మ గారు మరియు శిష్యులు- ఫ్లూట్, శ్రీ పేపకాయల రామకృష్ణ గారు- గాత్రం, శ్రీ అంగాడి శివప్రసాద్ గారు- గాత్రం, శ్రీమతి కేశిరాజు శారదాదేవి గారు- గాత్రం, శ్రీరామ సమాజం విద్యార్థులు- గాత్రం, శ్రీమతి సుధాఅనంత్, శిష్యులు- గాత్రం, శ్రీమతి లక్కరాజు శేషకుమారి మెమోరియల్ సంగీత శిక్షణా కేంద్రం- గాత్రం.

23.4న పై సభ ఆధ్వర్యంలో హైదరాబాదుకు చెందిన విద్వాన్ గరికిపాటి వెంకటప్రభాకర్ నూతన ప్రక్రియగా ప్రదర్శనలిస్తున్న "స్వరరాగావధానం"తో అలరించారు.







సాహిత్యావధానం వలెనే ఎనిమిది మందిపృచ్ఛకులను ఎదుర్కొని నూతన పోకడలతో రసవంతంచేశారు.

ఈ నూతనప్రక్రియ శ్రోతలను ఆకట్టుకొన్నది. సరస్వతీ గానసభ కొత్త తరహా కార్యక్రమాలను ఏర్పాటు చేసిన పేరొందింది.

సంగీత రంగంలో ప్రఖ్యాతులైన వారితో పాటుగా, ఆయారంగాల లబ్ధ ప్రతిష్టులు ఇందు పాల్గొన్నారు.

గానకళ సంగీత మాసపత్రిక సంపాదకులు శ్రీ మునుగంటి వెంకటరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. రాగమార్పు అంశాన్ని సభ కార్యదర్శి పేపకాయల రామకృష్ణగారు,రసమార్పును వీణవిద్వాంసులు డి.నగేశ్ బాబు గారు,తాళమార్పును ఆకొండి రాజారావుగారు,నిషిద్ధ స్వరంను అడ్వొకేట్ పెండ్యాల సుబ్బారావుగారు,స్వరాక్షరిని శ్రీమతి పెద్దాడ సూర్యకుమారిగారు,వర్ణనను సభ సహాయకార్యదర్శి చెరుకువాడ సత్యనారాయణ గారు,అప్రస్తుతాన్ని ప్రముఖ జ్యోతిషులు శ్రీ ఆకొండి సూర్యనారాయణ గారు రసవంతంగా నడపగా అంతే సమర్థతతో అవధాని ఎదుర్కొని శ్రోతలను ఆహ్లాదపరచారు.

అధ్యక్షులు డా.ముళ్ళపూడి నాగేశ్వరరావు గారు స్వాగతం పలుకగా జ్యోతి ప్రజ్వలన లోథ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షులు శ్రీ టిక్కు (లక్కరాజు సత్యనారాయణ్), మరొక సీనియర్ సభ్యులు శ్రీ సీతాపతిరావు, శ్రీకె.వి.వి.బి.శర్మ అవధానిగారిని సత్కరించారు.

# త్యాగరాజ నారాయణదాస సేవాసమితి,రాజమహేంద్రవరం 75వ వార్షిక సంగీత నృత్య నాటక సాహితీ మహోత్సవములు. మే నెల 6నుండి 23 వరకు.



6.5నస్థానిక విద్వాంసులచే పంచరత్నకృతులగానం.




6.5.న మొదటగా మంగళగానం గురివిల్లి అప్పన్న బృందం నాదస్వరం.



7.5న శ్రీమతి ఈమని కల్యాణీ లక్ష్మీనారాయణ వీణ .



9.5న డా.అనూరాధ కె.ఎన్.గాత్రసభ.




10.5 న శ్రీమతి ఎస్.ఉమాకుమార్ గాత్రం.



11.5.న శ్రీమతి జంధ్యం కృష్ణకుమారి భాగవతారిణి హరికథ.




12.5న శ్రీమతి ఎస్.జె.నందిని గాత్రం




13.5న సాహితీ వైజయంతి కార్యక్రమం




14.5.26న శ్రీమతి రమ్యకిరణ్మయి గాత్రం.




15.5.న శ్రీమతి ఎమ్.నర్మద వాయులీన సభ.



16.5.26 న మల్లాది శివానంద యశస్వి గాత్రం.




17 న శ్రీ టి.ఎన్.కృష్ణన్,గాత్రం.




19.5.న శ్రీమతి వేలూరి లక్ష్మీతులసి గాత్రం.




20.5న శ్రీ అభిలాష్ గిరిప్రసాద్ గాత్రం.




21.5.26.న మండ కృష్ణమోహన్ గాత్రసభ.




22.5.న బెంగుళూర్ హరిహరన్–అశోక్ ఎస్ గాత్రయుగళం.




23.5.26 న శ్రీ పి.జయభాస్కర్ బృందం వాయిద్య గోష్ఠి.




**24.5.26 న గజల్ శ్రీనివాస్ గజల్ కచేరీ కాకినాడ సూర్యకళామందిరంలో సరస్వతీగానసభ–గజల్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది.**



కార్యసిద్ధి హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా అమెరికా లోని బెర్లింగ్టన్ లో 3 ఏప్రిల్  సాయంత్రం జరిగిన విద్వాన్ మల్లాది సూరిబాబు గాత్ర సంగీతసభ. వయోలిన్- శ్రీమతి సంధ్య, మృదంగం- శ్రీ అరవింద్ కార్తిక్ , ఘటం- నమన దత్త.



సరస్వతీగానసభ కాకినాడ వారు విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారిగారికి జీవనసాఫల్య పురస్కారం అందించిన సందర్భంగా శ్రీరామ సమాజం కాకినాడ తరపున సత్కారం అందిస్తున్న సభా నిర్వాహకులు.



20526న కార్టూనిస్టుల పండుగ నాడు హైదరాబాదులో తలిశెట్టి రామారావుగారి అవార్డుగా నగదు పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకొన్న సరస సంగీత కార్టూనిస్ట్ కూడా అయిన శ్రీ సరసి....




"సంగీత శాస్త్ర బోధిని"  సంగీత గ్రంథం ఆవిష్కరణ సభ. వార్త లోపల పేజీలలో

Editor & Publisher : Ganakala,  M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721